RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 188 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | ఆదివారం, జనవరి 18 , 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 188 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Sunday, January, 18 , 2026 | PAGES : 8 RS : 4 /- |




## ఇరాన్‌లో అస్థిర పరిస్థితులు

### భారత్ హెచ్చరికతో స్వదేశానికి పౌరులు

**భారత్ హెచ్చరికతో స్వదేశానికి పౌరులు**

**రెండు విమానాల్లో పలువురిక రాక**

న్యూఢిల్లీ, :ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. నిరసనల కారణంగా ఇప్పటివరకు సుమారు రెండు వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఉద్రిక్తతల నేపథ్యం లో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌లోని భారతీయులు జాగ్రత్తగా ఉండాలని, వీలైనంత త్వరగా ఇండియాకు వచ్చేయాలని సూచించింది. శుక్రవారం రాత్రి రెండు కమర్షియల్ విమానాలు భారతీయులతో ఢిల్లీ చేరుకున్నాయి. అయితే.. అవి రెండూ రెగ్యులర్ విమానాలే.



## మున్సిపల్ ఎన్నికల్లో కీలక ముందడుగు

**- రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

**- ఎన్నికల సంఘానికి అందనున్న రిజర్వేషన్ల జాబితా**


హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణలో మున్సిపల్ కార్పొ రేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలకు సంబంధించిన రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. శనివారం సాయంత్రానికి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కానుంది. రాత్రికి లేదాఆదివారం ఉదయానికి రాష్ట్ర ఎన్నికల సంఘానికి రిజర్వేషన్ల జాబితా అందజేసే అవకాశం ఉంది.



## ప్రపంచ దేశాలకు ట్రంప్ మరో వార్నింగ్

**- గ్రీన్ లాండ్ ఆక్రమణను వ్యతిరేకిస్తే టారిఫ్ లు విధిస్తానని హెచ్చరిక**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రపంచ దేశాలకు మరోసారి టారిఫ్ ల హెచ్చరికలు చేశారు. గ్రీన్ లాండ్ ను ఎలాగైనా తీసేసుకుంటామని ఇప్పటికే స్పష్టం చేసిన ట్రంప్.. ఈ విషయంలో తమతో విభేదించే దేశాలకు టారిఫ్ లతో బదులిస్తామని వార్నింగ్ ఇచ్చారు. అమెరికా జాతీయ భద్రత విషయంలో గ్రీన్ లాండ్ చాలా కీలకమని అయితే సులువుగా, కాకపోతే కఠిన పద్ధతిలోనైనా దానిని స్వాధీనం చేసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఈ ఆక్రమణను వ్యతిరేకి స్తే సహించబోనని చెప్పారు.ప్రపంచ దేశాలను ఉద్దేశించి ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినప్పటికీ పరోక్షంగా డెన్మార్క్ ను నేరుగా హెచ్చరిం చినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గ్రీన్ లాండ్ ను అమెరికా ఆక్రమించుకోవాలని చూడడాన్ని డెన్మార్క్ మొదటినుంచీ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. తమ అధీనంలోని గ్రీన్ లాండ్ ఎన్నటికీ స్వతం త్రంగానే ఉంటుందని డెన్మార్క్ అధ్యక్షుడు మెట్టె ఫ్రెడెరిక్సన్ పలుమార్లు తేల్చిచెప్పారు.



## మమత సర్కారు చొరబాటుదారులను ఓటర్లుగా మారుస్తోంది

### ప్రధాని మోదీ

ఢిల్లీ,: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం విఫలమైందని ప్రధాని మోదీ విమర్శించారు. బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. పశ్చిమబెంగాల్ పర్యటనలో ప్రధాని మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే బీజేపీ ప్రభుత్వం కొలువుదీరాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ప్రజలు ముఖ్యంగా జెన్–జీ కూడా బీజేపీ అభివృద్ధి నమూనాను విశ్వసిస్తున్నారని ప్రధాని చెప్పారు. మాల్దా సభలో ప్రసంగించిన ఆయన.. బీహార్‌లో ఎన్డీఏ విజయం సాధించిందని, ఇక బెంగాల్‌కు సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ సందర్భంగా బెంగాల్‌కు అసలైన సవాల్ చొరబాట్లేనని, వీటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బెంగాల్‌కు అతిపెద్ద సవాల్ చొరబాట్లేనని, వీటి కారణంగానే మాల్దా, ముర్షిదాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగుతున్నాయని ప్రధాని చెప్పారు. చొరబాట్ల ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల జనాభా వర్గీకరణలోనూ మార్పు వచ్చిందని అన్నారు.



## బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్

**- ఇద్దరు మావోయిస్టుల హతం**

**- మృతుల్లో మావో నేత పాపారావు అలియాస్ మోంగు**

బీజాపూర్: మావోయిస్టు పార్టీకి మరో కీలక ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, మోస్ట్ వాంటెడ్ నేత పాపారావు అలియాస్ మోంగు ఉన్నాడు.

దక్షిణ బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు వ్యూహకర్త గా పాపారావు వ్యవహరిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌం టర్లలో సీనియర్ నేతలు మృతి చెందిన తర్వాత మిగిలిన టాప్ లీడర్లలో ఒకరిగా పాపారావు కొనసాగుతున్నాడు. పాపారావు కదలికలపై సమాచారం అందడంతో ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా దళాలు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి.

## మున్సిపల్ ఎన్నికలకు బిజెపి సన్నద్ధం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుందని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చేసిన కృషిని ఆయన అభినందించారు. దాదాపు 5 వేల సర్పంచ్ స్థానాలకు పోటీ చేశామని.. గతంలో కంటే బీజేపీ సర్పంచ్‌ల సంఖ్య పెరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతమైందని.. ఇందుకు ఈ ఫలితాలే నిదర్శనమని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ త్వరలో ముక్కలవు తుందని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని తెలంగాణ బీజేపీ చీఫ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లడం, సభలు నిర్వహించడం తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 40 శాతం కమిషన్‌గా మారిపోయిందని, పారిశ్రామికవేత్తలను బెదిరిస్తుందని ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు పెద్దఎత్తున నిధులు అందిస్తోందని.. వాటితోనే అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రాజెక్టులకు, విద్యాలయాలకు భూమి కేటాయించడం లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఏమీ చేయలేదని రాంచందర్ రావు విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధికి ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లాల్సిన అవసరం లేదని, కేంద్ర నిధులతోనే చేయవచ్చని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర పథకాలపై అబద్దాలు ప్రచారం చేస్తోందని.. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.



## 25 ఏళ్లు కష్టపడి చదివితే 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చు

**- తొలి ప్రధాని నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని వెల్లడి**

**- తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యత ఇస్తోందన్న ముఖ్యమంత్రి**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** 25 ఏళ్లు కష్టపడి చదివితే 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహబూ బ్ నగర్ జిల్లా జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, చిట్టబోయినపల్లి ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, తొలి ప్రధానమంత్రి నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులే నేటికీ జీవనాధారంగా నిలుస్తున్నాయని అన్నారు. భూగరిష్ఠ పరిమితి చట్టం తీసుకురావడంద్వారా కాంగ్రెస్ దొరల వద్ద ఉన్న లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిందని గుర్తు చేశారు.



## అభాగ్యనగరం.. వామ్మో.. కాలుష్యం..

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** సంక్రాంతి పండు గకు సొంతూళ్లకు వెళ్లారు.. హైదరాబాద్ నగరం సగం ఖాళీఅయ్యింది.. రోడ్లపై ట్రాఫిక్ తగ్గింది.. సిటీ బస్సులు, మెట్రో రైళ్లు సగం ఖాళీగానే కనిపిస్తున్నాయి. అసలే చలికాలం. వాహనాలు వదిలే పొగతో ముక్కులకు మాస్క్ లు ధరించి, బతుకుజీవుడా అంటూ ఇంటికి చేరే నగర వాసులకు ఈ నాలుగు రోజులు పండగే. పండుగ, పబ్బం లేనిరోజుల్లో అటు వాహనాల రద్దీ, ఇటు కాలుష్యంతో పొగచూరుతున్న నగ రం కూడా త్వరలోనే కాలుష్యంలో ఢిల్లీ స్థాయికి 'ఎదుగుతున్నదా' అనే ప్రశ్న అందరిని వెంటాడుతున్నది. ఢిల్లీలో రియల్ టైమ్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 400 దాటింది. 'ప్రమాదకర' విభాగంలోకి ప్రవేశించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రకారం ఢిల్లీలో ఏఐక్యూ 411గా న మోదైంది. ఇది తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలను కలిగించే స్థాయి కావడం గమ నార్హం. హైదరాబాద్ ఇప్పటికీ ఆ తీవ్రస్థాయికి చేరలేదు గానీ, నగరంలో క్రమంగా దిగజారుతున్న గాలి నాణ్యతను నిర్లక్ష్యం చేయలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే, హైదరాబాద్ కూడా అదే పరిస్థితిని ఎదుర్కొనే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు.



## మేడారం జాతరకు దగ్గరపడుతున్న ఘడియలు

**భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులకు ప్లాన్**

వరంగల్, : ఆసియా ఖండంలోనే అతిపెద్ద మహోత్సవం మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు శరవేగంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇంటిల్లిపాది తరలివెళ్లి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతర సమీపిస్తున్న వేళ ఇప్పటికే చాలా మంది భక్తులు మేడారం బాట పడుతున్నారు. ఈనెల 28, 29, 30, 31 తేదీల్లో మహాజాతర జరగనుండగా భక్తులను తరలించేందుకు ఆర్టీసీ అధికారులు సమాయత్తం అవుతున్నారు. జాతర జరిగే మూడు రోజుల ముందు నుంచే ప్రత్యేకంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. భూపాలపల్లి ఆర్టీసీ డిపో నుంచి వివిధ ప్రాంతాల మీదుగా మేడారానికి భక్తులతను సురక్షితంగా తరలించేందుకు భూపాలపల్లి ఆర్టీసీ డిపో అధికారులు సన్నద్ధమయ్యారు.

# ఘనంగా ఏడవ వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు






**వరంగల్,జనవరి 17, (తెలంగాణ దిశ) :** ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో ఏడవ వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తొలుత విద్యార్థుల చేత వివిధ రకాల క్రీడావిన్యాసాలు నిర్వహించారు. అనంతరం క్రీడా జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహి ంచారు. పోటీలలో గెలు పొందిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్ర మానికి వరంగల్ గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదం డ్రులందరూ విద్యా విషయాలకే కాకుండా క్రీడల ను కూడా అంతే స్థాయిలో ప్రోత్సహించాలన్నా రు. చదువు, కెరీర్‌తో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలనీ అదే విధంగా ఇటీవల భారత మహిళా క్రికెట్ జట్టు వరల్డ్ కప్ గెలుపొందిన మ్యాచ్‌ను చూస్తున్నపుడు నేను గమనించిన విషయం ఏమనగా మన దేశ చరిత్రలో ఇంతవరకు మహిళల క్రికెట్‌కు ఇంతటి స్పందన రావడం ఎప్పుడూ చూడలేదన్నారు. ఆ రోజు నిజంగా గర్వించదగ్గ రోజు అని, పురుషుల ఆధిపత్యంగా భావించే క్రీడలో మహిళలు ముందుకు వచ్చి తమ సత్తాను చాటుకుని, దేశానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. మానసిక ఆరోగ్యానికి ఆటలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. విద్యార్థి దశ నుండి విద్యతో పాటు క్రీడలలో కూడా పాల్గొని అన్ని రంగాలలో రాణిం చాలని అన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్. సరిత రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో చేపట్టిన ప్రణాళి కలు, వాటి ప్రగతి, అమలు చేస్తున్న విధానాలను వివరించారు వివిధ రకాల క్రీడా పోటీలలో రాష్ట్ర, జాతీయ స్థాయిలలో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. అలాగే హెచ్ పిఎస్ సొసైటీ కి చెందిన కార్యవర్గ సభ్యులు అపనేందర్ బాబు, హేమంత్ జలాన్, రామంతాపూర్ ప్రిన్సిపాల్ నరసింహ రెడ్డి క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఈ విద్యా సంవత్సరం క్రీడలలో రాణించిన నాగార్జున టీమ్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ అవార్డును గెలుచుకున్నారు. రెండవ స్థానంలో నలంద హౌస్ నిలించింది. ఈ కార్యక్రమంలో నాగార్జున హౌస్ మాస్టర్ చంద్రమౌళి, తక్షశిల హౌస్ మాస్టర్ రాజ్ కుమార్, నలంద హౌస్ మాస్టర్ సంతోష్, విజయనగర హౌస్ మాస్టర్ శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు మహ్మద్ ఆసిఫ్ ఇక్బాల్, రీయాజ్, విద్యార్థి నాయకులు వివేక్, వర్షిత, నిహారిక, శ్రేష్ఠ, హాన్స్ రాజ్, హర్ష గీతిక, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# లాటరీ ద్వారా మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్ల ఖరారు...






**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 17, (తెలంగాణ దిశ) :**0జిల్లాలోని మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లను లాటరీ ద్వారా జిల్లా కలెక్టర్ మను చౌదరి ఖరారు చేశారు. త్వరలో జరగబోయే ఎల్లంపేట్, మూడు చింతలపల్లి, అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియలతో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి సమావేశమయ్యారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎస్టీ మహిళ, ఆలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గా జనరల్ మహిళ, మూడు చింతపల్లి మున్సిపల్ చైర్మన్ గా ఎస్ సీ జనరల్ కు రిజర్వేషన్లను ఖరారు చేశారు.

అదే విధంగా ఎల్లంపేట్ 24 వార్డులు, మూడు చింతలపల్లి 24 వార్డులు, అలియాబాద్ 20 వార్డులకు గాను ఎస్ టి, ఎస్ సి, బిసి, మహిళ రిజర్వేషన్లను సామాజిక, ఆర్థిక, కుల సర్వేను అనుసరించి లాటరీ పద్ధతిలో రిజర్వేషన్ల వివరాలను కలెక్టర్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన గజిట్ ను విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ సాంబశివరావు, ఎల్లంపేట్, మూడు చింతలపల్లి, అలియాబాద్ మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి అందరూ ఐక్యంగా పని చేయాలి





**కుత్బుల్లాపూర్, జనవరి 17, (తెలంగాణ దిశ) :**సంక్రాంతి పండగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులు మరియు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త వెలుగులు నింపాలని ఆకాక్షించారు. ముఖ్యంగా రైతులకు మంచి పంటలు, ప్రజలకు ఆరోగ్యం, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రజాపాలన ప్రభుత్వంతో కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమానికి నిరంతరం కట్టుబడి ఉందని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి అందరూ ఐక్యంగా పని చేయాలని పిలుపు నిచ్చారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత బలంగా ప్రజల పక్షాన నిలబడతామని హామీ ఇచ్చారు.

# చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ప్రాంగణంలో బోరుబావి మంజూరు చేయాలి



**కుత్బుల్లాపూర్, జనవరి 17, (తెలంగాణ దిశ) :**శ్రీరామ్ నగర్ పరిధిలోని రోడమేస్త్రి నగర్, బి లో ఉన్న చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ప్రాంగణంలో బోరుబావి మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డిని శనివారం చర్చి ప్రతినిధులు కోరారు. చర్చ్ఆఫ్ క్రైస్ట్‌లో క్రమం తప్పకుండా ఆరాధన సేవలు, ప్రార్థన సమావేశాలు, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అయితే ప్రస్తుతం చర్చి ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో తీవ్ర నీటి కొరత నెలకొందని వారు వివరించారు. ముఖ్యంగా వేసవి కాలంలో నీటి సమస్య తీవ్రమై, చర్చి సభ్యులు మరియు సందర్శకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బోరు బావి ఏర్పాటు చేయడం ద్వారా చర్చి యొక్క ప్రాథమిక నీటి అవసరాలు తీర్చడమే కాకుండా, సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న దాదాపు 600 మందికి పైగా ప్రజలకు కూడా ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన హన్మంత్ రెడ్డి సంబంధిత అధికారులతో చర్చించి బోరుబావి మంజూరు కోసం అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఎండీ. లాయక్, అజయ్, బి. ప్రేమ్ దాస్, ఎం. నూకరాజు, ఎం. సుకుమార్, ఆర్. శంకర్, ఆర్. శివరాజ్, మల్లికార్జున, సాల్మన్, ఏసు, దేవదాస్, మరియాల మహేష్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలల్లో సత్తా చాటాలి





**హైదరాబాద్, జనవరి 17, (తెలంగాణ దిశ) :**0త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలలో బిఆర్ఎస్ శ్రేణులు సత్తా చాటాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు సూచించారు. శనివారం లోటస్ పాండ్ సమీపంలో బిఆర్ఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రతినిధులతో వారు సమావేశమయ్యారు. మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి తో కలిసి పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటామని తెలిపారు. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ కల్లబొల్లి వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపం అర్థమైందన్నారు. భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా బిఆర్ఎస్ సత్తా చాటడం ఖాయమన్నారు.

# రోడ్డు భద్రతా ప్రమాణాలపై విద్యార్థులకు అవగాహన






**నాగారం, జనవరి 17, (తెలంగాణ దిశ) :**0జవహర్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం జెడ్‌పిహెచ్ఎస్ లో జాతీయ రోడ్డు భద్రతా మాసంలో భాగంగా అరైవ్, అలైవ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ నగర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ కె. శివ శంకర్ హైస్కూల్ విద్యార్థులకు మైనర్ డ్రైవింగ్ పరిణామాలపై అవగాహన కల్పించారు. డ్రంకెన్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, మొబైల్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్‌ను నివారించడం లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం యొక్క ప్రాముఖ్యతను మరింత వివరించారు. తరువాత ఉపాధ్యాయుల సమన్వయంతో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ డ్రాయింగ్‌లను ఎంపిక చేసి మొదటి, రెండవ, మూడవ బహుమతులన ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జోజి, పిసి రాజేష్, హెచ్‌సి మురళి, పాఠశాల హెడ్ మాస్టర్ రాములు, ఉపాధ్యాయులు రఘు, సాహెబ్ ఇతరులు పాల్గొన్నారు.

# సోలాపూర్ మున్సిపల్ ఎన్నికలలో గుర్రం సత్యనారాయణ రామస్వామి విజయం





**హైదరాబాద్, జనవరి 17, (తెలంగాణ దిశ) :**0మహారాష్ట్ర సోలాపూర్ లో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన పద్మశాలి బిడ్డ, బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి కార్పొరేటర్‌గా విజయం సాధించి అందరిని ఆశ్చర్య పరిచారు. గుర్రం రామయ్య కుమారుడు సత్య నారాయణ వ్యాపార రీత్యా సోలాపూర్ లో స్థిరపడ్డారు. సోలాపూర్ మున్సిపల్ ఎన్నికలలో బిజెపి అభ్యర్థిగా 13వ వార్డు కార్పొరేటర్ గా పోటీ చేశారు. నిత్యం స్థానిక ప్రజలతో సఖ్యతతో ఉంటూ ఉండడం, ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ ఉండడంతో ఆయన గెలుపుకు దోహదం చేసింది. స్వతహాగా దైవభక్తి ఉండడం సనాతన ధర్మంపై నిత్యం అనేక కార్యక్రమాలు నిర్వహించడం కలిసి వచ్చింది.

సోలాపూర్ నగర పాలిక ఎన్నికలలో ఇతనిని గుర్తించిన భారతీయ జనతా పార్టీ నాయకత్వం టికెట్ కేటాయించింది. దీంతో ప్రజాసేవ పై స్పందించే సత్యనారాయణ ను ప్రజలు గెలిపించారు.

# మల్లాపూర్ డివిజన్ లోని పెండింగ్ పనులు పూర్తి చేయాలి

## - కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నేత నెమలి అనిల్ కుమార్






**మల్లాపూర్,జనవరి 17, (తెలంగాణ దిశ) :** మల్లాపూర్ డివిజన్ లో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ గారు జలమండలి శాఖ మరియు విద్యుత్ శాఖ అధికారులతో కలిసి బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా ఓల్డ్ మల్లాపూర్ లో జలమండలి ఏ ఈ సిరాజ్, విద్యుత్ శాఖ ఏఈ విజయతో పర్యటించారు. సమస్యలతో ఇబ్బంది పడుతున్న పలు బస్తీలు, కాలనీలలో పర్యటించి అధికారులకు సమస్యలను వివరించారు. అలాగే గత కొన్ని రోజుల నుండి ఉన్న పెండింగ్ పనులను పూర్తిచేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు అతి త్వరలో పనులను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి శాఖ, విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# పిల్లలకు సోషల్ మీడియా నిషేధం..

### డెన్మార్క్ ప్రభుత్వం నిర్ణయం

### 15 సం లోపు వారికి అనుమతి నిరాకరణ

కొపెన్‌హెగెన్ : డెన్మార్క్ ప్రభుత్వం 15 సంవత్సరాలలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించింది. దీనికి సంబంధించిన నివేదికను ఆ దేశ డిజిటలైజేషన్ మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసింది. సోషల్ మీడియా పిల్లల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. నిద్రకు అంతరాయం కలుగుతుందని, ఏకాగ్రత కోల్పోతున్నారని తెలిపింది. ఆన్‌లైన్ మోసాలకు పిల్లలు బలైపోతున్నారని అధికారులు వెల్లడించారు..

డిజిటలైజేషన్ మంత్రి మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియా పిల్లల బాల్యాన్ని, వారి సమయాన్ని, వారి ఆనందాన్ని దోచుకుంటోందని, దానికి తాము ముగింపు పలుకుతున్నామని ప్రకటించారు. ఆన్‌లైన్ ప్రపంచంలో హానికరమైన కంటెంట్, వాణిజ్య ప్రభావాలు తీవ్రమైపోయాయని, వాటి నుండి యువతను రక్షించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన కొత్త మార్గదర్శకాల్లో యుట్యూబ్, స్నాప్‌చాట్, ఇన్‌స్టా గ్రామ్, టిక్‌టాక్ వంటి దిగ్గజ సంస్థలపై నియంత్రణలు ఉన్నాయి. అయితే 13 సంవత్సరాలు దాటిన వారికి తల్లిదండ్రుల సమక్షంలో అనుమతించనున్నారు.

అదీ పరిమిత కాలం వరకే. కొన్ని నెలల క్రితం ఆస్ట్రేలియా ఇటువంటి నిర్ణయాన్నే తీసుకుంది. యూరోపియన్ యూనియన్ దేశాల్లో సోషల్ మీడియాను వయో పరిమితి ఆధారంగా నియంత్రించిన మొదటి దేశంగా డెన్మార్క్ నిలిచింది. ఈ నిర్ణయంతో పిల్లల్లో మానసిక ఆరోగ్యం, వారి అభివృ ద్ధికి, విచ్చలవిడాగా పెరిగిపోతున్న సోషల్ మీడియా నియంత్రణకు దోహదపడుతుందని పలువురు భావిస్తున్నారు.

# సంపాదకీయం

## క్రికెట్ మైదానం నుంచి ఉగ్రవాద శిబిరాల వరకు

భారత్– పాకిస్తాన్.. రెండూ దాయాది దేశాలే.. ఒకే తాను ముక్కలే.. కానీ ఏడు దశాబ్దాలుగా ఇరు దేశాల మధ్య శత్రుత్వం కొనసాగుతోంది. పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. వైరం ఏటా పెరుగుతోంది. ఈ ఏడాది పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఈ వైరం మరింత పెరిగింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్.. భారత్ తలుచుకుంటే చరిత్ర పటంలో మిగలదు. కానీ, అక్కడి పాలకులు, ఉగ్రవాదులు పాకిస్తానీలకు అణువనువునా విద్వేషం పెంచి పోషిస్తున్నారు. భారత వ్యతిరేకులుగా మారుస్తున్నారు. ఇందుకు తాజా నిదర్శనం ఆసియా కప్ 2025 సూపర్ 4లలో భాగంగా సెప్టెంబర్ 21న జరిగిన భారత్?పాకిస్తాన్ మ్యాచ్ క్రికెట్ మ్యాచ్. ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ ఓపెనర్ సహీబ్‌జాదా ఫర్హాన్ తన 50 పరుగుల సందర్భంగా బ్యాట్‌ను తుపాకీలా పట్టుకుని కాల్చినట్లు అభినయించడం, హారిస్ రౌఫ్ 'రాఫెల్' విమానం కూల్చినట్లు చేతులతో సూచించడం వంటి సంఘటనలు ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయ్యాయి. ఈ చర్యలు 'జెంటిల్‌మెన్స్ గేమ్' నుంచి యుద్ధ వాతావరణంగా మార్చాయి. మ్యాచ్ తర్వాత భారత్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పాకిస్తాన్ కెప్టెన్‌తో షేక్ హ్యాండ్‌లు చేయకపోవడం, సిరీస్ గెలిస్తే పాకిస్తాన్ వ్యక్తి చేత అవార్డు స్వీకరించకపోవాలని నిర్ణయం తీసుకోవడం ఈ విద్వేషాన్ని మరింత ఊపందుకునేలా చేసింది. పాకిస్తాన్ క్రికెటర్లు మ్యాచ్‌లో చూపిన అభినయాలు క్రీడా స్ఫూర్తిని దెబ్బతీస్తూ, దేశంలోని ఉగ్రవాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఫర్హాన్ తన బ్యాట్‌ను ఏకే?47 తుపాకీలా పట్టుకుని భారత జట్టు దిగ్బంధనం వైపు 'కాల్చినట్లు' చేయడం, రౌఫ్ 'రాఫెల్' విమానం కూల్చినట్లు చేతులతో సూచించి '6?0' అని చూపించడం (ఆపరేషన్ సిందూర్‌లో పాక్ 6 భారత విమానాలను కిందపడేశామనే తప్పుడు ప్రచారానికి సూచన) వంటివి సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలకు దారితీశాయి. ఈ చర్యలు పాకిస్తాన్ సమాజంలోని 'ముజాహిద్ మెంటాలిటీ'ని మైదానంలోకి తీసుకువచ్చినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇది క్రికెట్‌ను రాజకీయ ఆయుధంగా మార్చి, భారత్‌పై విద్వేషాన్ని ప్రదర్శించడానికి ఉదాహరణగా మారింది. ఫలితంగా, భారత జట్టు పాక్ ఆటగాళ్లతో దూరం పాటించడం మొదలుపెట్టింది, ఇది క్రీడా భావనలకు విరుద్ధమని అంతర్జాతీయ క్రికెట్ సంఘాలు చర్చిస్తున్నాయి. మే 7 భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే) మరియు పాకిస్తాన్‌లోని 9 ఉగ్రస్థావరాలపై దాడి చేసి, 100 మంది ఉగ్రవాదులను చంపింది. ఈ దాడుల్లో జైష్?ఏ?మహ్మద్ (జెఎమ్) ప్రధాన కార్యాలయం బహావల్‌పూర్‌లోని మర్కజ్ సుభానల్లా, లష్కర్?ఏ?తొయిబా (ఎల్ఎటి) మురీద్కేలోని మర్కజ్ తైబా వంటి కీలక స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడుల్లో జెఎమ్ ప్రధాని మసూద్ అజర్ కుటుంబ సభ్యులు 10 మంది మరణించారు, అతని సోదరుడు యూసుఫ్ అజర్ (1999 కాందహార్ విమాన హైజాక్ చేసినవాడు) సహా. మసూద్ అజర్ 1999లో భారత విమానాన్ని హైజాక్ చేసి విడుదలైన ముగ్గురు ఉగ్రవాదుల్లో ఒకడు, జెఎమ్‌ను స్థాపించి పార్లమెంట్, పుల్వామా దాడులకు కారణమయ్యాడు. ఈ దాడులు పాహల్గామ్ టెర్రర్ అటాక్ (ఏప్రిల్ 22, 2025లో 26 మంది మరణాలు)కు ప్రతీకారంగా జరిగాయి. ఈ సంఘటనలు పాక్ ఉగ్రవాద యంత్రాంగానికి తీవ్ర దెబ్బ తీసుకొచ్చాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్?ప్రాయోజిత ఉగ్రవాద సంస్థలు పీవోకే, పంజాబ్ నుంచి కైబర్ పక్తూంఖ్వా (కేపీకే)కు తమ స్థావరాలను తరలిస్తున్నాయి. జెఎమ్, ఎల్ఎటి, హిజ్బుల్ ముజాహిదీన్ (ఎచ్ఎమ్) వంటి సంస్థలు కేపీకేలోని మాన్సెహ్రా, గర్హీ హబీబుల్లా వంటి ప్రాంతాల్లో కొత్త శిబిరాలు నిర్మిస్తున్నాయి. ఈ తరలింపు భారత దాడుల నుంచి రక్షణ కోసం, అఫ్ఘనిస్తాన్ సరిహద్దు సమీపంలోని కఠిన భూభాగాన్ని ఉపయోగించడానికి జరుగుతోంది. సెప్టెంబర్ 14న మాన్సెహ్రాలో జెఎమ్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ జరగడం ఈ మార్పును స్పష్టం చేసింది. పాక్ ప్రభుత్వం ఈ చర్యలకు మద్దతు ఇస్తూ, ఉగ్రవాదులకు సురక్షిత ప్రదేశాలు అందిస్తోంది. ఇది భారత్‌పై తదుపరి దాడులకు తయారి చేస్తున్నట్లు తెలుస్తోంది. ధ్వంసమైన ఉగ్రస్థావరాల పునర్నిర్మాణంపై పాకిస్తాన్ ఉగ్రవాద యంత్రాంగం పట్టుదలను చూపిస్తోంది. బహావల్‌పూర్‌లోని సుభానల్లా కాంప్ కాంప్లెక్స్ (సరిహద్దు నుంచి 200 కి.మీ. దూరం), మురీద్కేలోని ఎల్ఎటి కేంద్ర కార్యాలయాలు పాక్ ప్రభుత్వ సహాయంతో పునర్నిర్మిస్తున్నాయి. మురీద్కేలో ఆగస్టు 18 నుంచి డిమాలిషన్ పూర్తి చేసి, సెప్టెంబర్ 7 నాటికి పునర్నిర్మాణం ప్రారంభమైంది, 2026 ఫిబ్రవరి నాటికి పూర్తి స్థాయికి చేర్చాలని లక్ష్యం. పాక్ ప్రభుత్వం 4 కోట్లు మద్దతు ఇచ్చింది, 'ఫ్లడ్ రిలీఫ్' పేరిట డబ్బులు సేకరిస్తూ ఈ పనులకు ఉపయోగిస్తున్నారు. ఈ చర్యలు ఉగ్రవాదాన్ని పునరుజ్జీవనం చేస్తూ, భారత్‌పై కొత్త ముప్పును సృష్టిస్తున్నాయి. ఆసియా కప్ మ్యాచ్‌లో పాక్ క్రికెటర్ల ప్రవర్తన, ఉగ్రస్థావరాల తరలింపు, పునర్నిర్మాణం భారత్?పాకిస్తాన్ మధ్య విద్వేషం ద్వంద్వాన్ని స్పష్టం చేస్తున్నాయి. క్రికెట్ మైదానంలో 'తుపాకీ, విమాన ధ్వంసం' అభినయాలు ఉగ్రవాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుంటే, ఆపరేషన్ సిందూర్ తర్వాత కేపీకేలో కొత్త శిబిరాలు భవిష్యత్ దాడులకు సిద్ధం కావడాన్ని సూచిస్తున్నాయి. భారత్ ఈ ముప్పును ఎదుర్కోవడానికి డిప్లొమసీ, సైనిక చర్యలు మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

# అమెరికన్, డెల్టా, సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ భారీగా సర్వీసుల కోత..!




వాషింగ్టన్ : అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ ప్రభావం విమానయాన రంగంపై తీవ్రంగా పడింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పెరగడంతో దేశవ్యాప్తంగా వందలాది విమానాలు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు తమ ప్రయాణాలను రీ షెడ్యూల్ చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భద్రతా కారణాల దృష్ట్యా దేశంలోని రద్దీ ఎక్కువగా ఉండే 40 ప్రాంతాల్లో విమాన సర్వీసులను 10 శాతం వరకు తగ్గించాలని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ విమానయాన సంస్థలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో 750కి పైగా విమాన సర్వీసులను ముందుగానే రద్దు చేసినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌అవేర్ వెల్లడించింది. ప్రముఖ విమానయాన సంస్థ అమెరికన్ ఎయిర్‌లైన్స్ రోజుకు 220 విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించగా, డెల్టా ఎయిర్‌లైన్స్ 170 సర్వీసులను, సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ 100 సర్వీసులను నిలిపివేసినట్లు తెలిపాయి. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు, విమానాశ్రయ భద్రతా సిబ్బంది సహా వేలాది మంది కీలకఉద్యోగులకు జీతాలు అందడం లేదు. దీంతో సిబ్బంది కొరత ఏర్పడింది. చాలామంది అనారోగ్య కారణాలతో సెలవులు పెడుతుండటంతో ఏటీసీ సేవలకు అంతరాయం కలుగుతోంది. ఇప్పటికే 6,400కు పైగా విమానాలు ఆలస్యంగా నడవగా, 200 సర్వీసులు రద్దయ్యాయి. బోస్టన్, నెవార్క్ విమానాశ్రయాల్లో ప్రయాణికులు రెండు గంటలకు పైగా, షికాగో, వాషింగ్టన్ ఎయిర్‌పోర్టుల్లో గంటకుపైగా వేచి చూడాల్సి వచ్చింది. "ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, ముందే మేల్కోవడం మంచిదని భావిస్తున్నాం. పరిస్థితులు దిగజారకముందే ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం" అని ఎఫ్ఏఏ అడ్మినిస్ట్రేటర్ బ్రయాన్ బెడ్‌ఫోర్డ్ తెలిపారు. కొన్ని వారాల్లో థ్యాంక్స్‌గివింగ్ సెలవులు రానున్న నేపథ్యంలో ప్రయాణాల రద్దీ మరింత పెరగనుంది. ఈ సమయంలో విమానాల రద్దు ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయనుంది. అట్లాంటా, డెన్వర్, చికాగో, హ్యూస్టన్, లాస్ ఏంజిల్స్ వంటి ప్రధాన విమానాశ్రయాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండనుంది. అయితే, విమాన ప్రయాణాలు సురక్షితమేనని, ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రవాణా శాఖ కార్యదర్శి సీన్ డఫీ భరోసా ఇచ్చారు. కాగా, తన 35 ఏళ్ల సర్వీసులో ఇలాంటి పరిస్థితులను ఎప్పుడూ చూడలేదని, ప్రభుత్వ షట్‌డౌన్‌ల విషయంలో ఇది ఒక కొత్త అనుభవమని బెడ్‌ఫోర్డ్ వ్యాఖ్యానించారు.



# ఏదీ ప్రయాణ భద్రత?

**ఇటీవల తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు మన రవాణా వ్యవస్థలోని లోపాలను బట్టబయలు చేస్తున్నాయి. రహదారి భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. ఉద్యోగం, ఉపాధి, పరామర్శ, సందర్శన తదితర అవసరాలకు ప్రయాణాలు చేయడం ఏ ఒక్కరికైనా తప్పనిసరి. ఇలా ప్రయాణమై సాగే వాళ్లు భద్రంగా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలి. అందుకు తగ్గట్టుగా రహదారులు, వాహనాలు, రవాణా వ్యవస్థ సన్నద్ధమై ఉండాలి. కానీ, ఏం జరుగుతోంది మనదేశంలో? ప్రపంచంలోని వాహనాల్లో మనదేశంలో ఉన్నవి ఒక్క శాతం కాగా, రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న వారి సంఖ్య మాత్రం 11 శాతం! మన రోడ్డు భద్రతా వ్యవస్థలోని లోపాలను, ప్రమాణాల్లోని డొల్లతనాన్ని ఈ లెక్క వెల్లడి చేస్తోంది.**

దేశంలో ఏటా దాదాపు 5 లక్షల రోడ్డు ప్రమాదాలు జరిగి,2 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. గాయపడ్డవారి సంఖ్యదీనికి రెట్టింపు ఉంటుంది. ఈ ప్రమాదాల్లో 70 శాతం అతివేగంవల్లే సంభవిస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. రాంగ్‌రూట్లో నడపటం, మద్యం సేవించి నడపటం వంటి కారణాలు తరువాతి వరుసలో ఉన్నాయి. ప్రమాదాల్లో అత్యధిక భాగం జాతీయ రహదా రుల మీదనే జరుగుతున్నాయి. ఎక్కడ, ఎందుకు, ఏ సమయంలో, ఏ పరిస్థితుల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయో సంబంధిత శాఖల వద్ద స్పష్టమైన గణాంకాలూ, సోదాహరణమైన వివరాలూ ఉన్నప్పటికీ– వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలే ప్రశ్నార్థకం! ప్రయాణాలకు వీలుగా రహదారులను భద్రంగా ఉంచటం, వేగ నియంత్రణ, వాహనాల స్థితిపై తనిఖీ, ప్రమాణాల పాటింపువంటి చర్యలను పటిష్టవంతంగా అమలు చేస్తే–ఇన్ని ప్రమాదాలు జరిగి ఉండేవి కావు. ఈ మధ్య జరిగిన ప్రమాదాల్లోనే పాలకుల తరఫున అనేక డొల్లతనాలు, నిర్లక్ష్యాలూ బయటపడ్డాయి. ప్రయివేటు బస్సులు నడపటంలో ప్రమాణాలకు నీళ్లొదలటం స్పష్టంగా కనిపిస్తోంది. వేగంపై నియంత్రణ లేకపోవటం, సిట్టింగ్ ప్రయాణ అనుమతులున్న బస్సులను స్లీపరు కోచ్‌లుగా మార్చటం, భద్రతా పద్ధతులను పట్టించుకోకపోవటం, డ్రైవర్లకు సరైన శిక్షణ, నిర్వహణపై అవగాహన లేకపోవటం పెను ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రజారవాణాను ప్రయివేటు వ్యక్తుల చేతిలో పెట్టటంతోనే ప్రయాణ భద్రతకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొంది. ప్రమాదాలను నివారించాలంటే ఈ అంశాలపై తప్పకుండా చర్చించాలి. సరైన ప్రమాణాలను, పద్ధతులను ఆచరించాలి.

పాలకులు జాతీయ రహదారులను ఆదాయ వనరులుగా ఉపయోగించుకోవటంపై చూపుతున్నంత శ్రద్ధ–వాటిని భద్రతా మార్గాలుగా మలచటంపై కనపరచటం లేదు. హైవేలు అంతటా నెలకొల్పిన టోల్‌ప్లాజాలు ఏటా వేలాది కోట్ల రూపాయలను వాహనదారుల నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం జాతీయరహదారిపై రూపాయి పెట్టుబడి పెట్టి, రూ.3.31ల ఆదాయాన్నిఆర్జిస్తోంది. అంటే పెట్టుబడికి మూడింత లు పైగానే రాబడిని పొందుతోంది. కానీ, రహదారి భద్రతపై చూపుతున్న శ్రద్ధ, పెడుతున్న ఖర్చూ అంతంతమాత్రంగానే ఉంది.

ఆదాయంలో అత్యధిక భాగాన్ని రిలయన్స్ వంటి కార్పొరేట్ల ఖజానాలోకి ప్రవహించే విధంగానే హైవేల నిర్వహణ సాగుతోంది.

భద్రమైన రహదారులు, సురక్షితమైన ప్రయాణం ఒక దేశ అభివృద్ధికి అచ్చమైన కొలమానం. ప్రపంచంలో జరిగే ప్రమాదాల్లో నూటికి 18మనదగ్గరే జరుగుతున్నందున – మనదేశ రవాణా వ్యవస్థ ఇంకా అస్తవ్యస్త దేశాల సరసనే ఉంది.

లాభాలే పరమార్ధంగా సాగే ప్రైవేటు రవాణా వ్యవస్థ భద్రతకు ఇచ్చేప్రాధాన్యం అంతంతమా త్రంగానే ఉంటుంది.రైల్వేల్లో అయినా, రోడ్డురవాణాలో అయినా–నైపుణ్యమూ, నాణ్యతా ఉన్న సిబ్బంది సేవలు అవసరమవు తాయి. కీలకమైన విభాగాల్లో శాశ్వత ఉద్యోగులను నియమించకుండా ప్రయివేటు, కాంట్రాక్టు సేవలకు వదిలేయటం అంటే భద్రతకు భరోసా లేనట్టే లెక్క! కాలం చెల్లిన వాహనాలను రోడ్డెక్కకుండా చేయడం, ఉన్న వాహనాల కండిషన్‌పై నిరంతర తనిఖీలు జరపటం తక్షణ అవసరం. రాజకీయ జోక్యాలతోనూ, ఇతరత్రా కారణాలతోనూ ప్రైవేటు ట్రావెల్స్ పట్ల ఉదాసీనత ప్రదర్శించటాన్ని మానుకోవాలి. భద్రమైన ప్రయాణం ప్రతి ఒక్కరి హక్కు. దానిని కాపాడే బాధ్యత ప్రభుత్వానిది!

# వీసా కలకలం..!



విదేశాలకు చెందిన నిపుణులకు అమెరికా జారీ చేసే హెచ్1బి వీసా ఫీజును ఎకాయికిన లక్ష డాలర్లకు (రూ.88 లక్షలు) పెంచుతూ ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం ప్రపంచంలో పెను సంచలనం రేపగా, ఆ మర్నాడే నష్ట నివారణా చర్యగా పెంచిన రుసుం కొత్త దరఖాస్తులకు మాత్రమేనని, ఒకేసారి చెల్లించేదని యుఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్, వైట్ హౌస్ వేర్వేరుగా వివరణలిచ్చాయి. స్థానిక అమెరికన్లకే ఉద్యోగాలనే కుహనా జాతీయ వాదాన్ని ప్రజల్లో రేగ్గొట్టి అధికారంలోకొచ్చిన ట్రంప్, వచ్చింది మొదలు ప్రతీకార, కక్షపూరిత, ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం చూస్తున్నదే. ప్రస్తుత హెచ్1బి వీసాల ఫీజు పెంపు ఆ కోవలోకే వస్తుంది. ఇప్పటి వరకు సదరు వీసాకయ్యే ఫీజు 2 వేల డాలర్ల నుంచి 5 వేల డాలర్ల వరకు ఉంది. ఒకేసారి లక్ష డాలర్లకు పెంచడం వలన అమెరికాలో విదేశీ నిపుణులపై ఆధారపడ్డ కంపెనీలు అనివార్యంగా తమ దగ్గర పని చేస్తున్న వారిని ఇంటికి సాగనంపే పనైనా చేయాలి. లేదంటే నిర్ణయించిన ఫీజునైనా చెల్లించాలి. అదీ కాకపోతే అమెరికన్లను ఉద్యోగానికి పెట్టుకోవాలి. దీని వలన అమెరికా కంపెనీలపై పడే అదనపు భారం 14 బిలియన్ డాలర్లు (రూ.1.23 లక్షల కోట్లు) అని అంచనా. ఆ భారాన్ని కంపెనీలు మోయకుంటే అమెరికాలో ఉద్యోగం సంపాదించి నాలుగు రాళ్లు వెనకేసుకోవాలని కలలు కనే భారత్, ఇతర దేశాల యువత కలలు చెదిరిపోతాయి. వాస్తవానికి విదేశాల్లోని నిపుణులను తక్కువ వేతనాలపై నియమించుకొని అక్కడి కంపెనీలు దోపిడీ చేసుకొనేందుకు వీలుగా అమెరికా హెచ్1బి వీసాలను ప్రవేశపెట్టింది. అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్, మెటా వంటి సంస్థలు బాగా లబ్ధి పొందాయి కూడా. కాగా విదేశాల నుంచి తమ దేశానికి వస్తున్న వారు తమ ఉద్యోగాలను, ఉపాధిని కబ్జా చేసి, తమకు దక్కాల్సిన అవకాశాలను తన్నుకుపోతున్నారని కొన్నేళ్లుగా అమెరికన్లలో అసంతృప్తి నెలకొంది. దాన్ని ట్రంప్ ఎన్నికల్లో రాజకీయంగా క్యాష్ చేసుకున్నారు. యువతకు ఇచ్చిన హామీ అమలులో భాగంగా హెచ్1బి వీసాల ఫీజు భారీగా పెంచి తద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలిచ్చి సంతృప్తి పర్చాలన్నది ట్రంప్ పన్నాగం. ఇదొక్కటే హెచ్1బి వీసాల రుసుం పెంపునకు కారణం కాదు. తన వాణిజ్య ప్రయోజనాల కోసం కూడా. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన అమెరికాను తాత్కాలికంగానైనా బయట పడేసేందుకు ఇటువంటి దుర్మార్గపు దారులు ఎంచుకున్నారు. దానితోపాటు తన దారికి రాని దేశాలపై ఒత్తిడి పెంచడానికి, బలవంతపెట్టి తన దారికి తెచ్చుకోడానికి, లొంగదీసుకునే వ్యూహం సైతం ఇమిడి ఉంది. ఇప్పటికే అమెరికాలోకి వచ్చే వస్తువుల దిగుమతులపై కొన్ని రెట్ల సుంకాల విధింపు చూస్తున్నదే. కొందరికి కొన్ని సడలింపులు, కాల పరిమితులు ఇచ్చినా అంతిమంగా పలు దేశాలపై తన పెత్తనాన్ని బిగించేందుకు, తనను సవాల్ చేస్తున్న చైనా, ఇతర దేశాలపై వాణిజ్య యుద్ధం ప్రకటించి ఇబ్బంది పెట్టడానికి ట్రంప్ తన అమ్ములపొదిలో నుంచి ఒక్కొక్కటిగా 'ఆయుధాల'ను ప్రయోగిస్తున్నారన్నది అసలు సిసలైన వాస్తవం.

తాజాగా ట్రంప్ తీసుకున్న వీసా రుసుం పెంపు నిర్ణయం భారతదేశానికి, అమెరికా కంపెనీల్లో కొలువు చేస్తున్న, కొత్తగా కొలువులు దక్కించుకోవాలని ఉబలాటపడుతున్న వారికి నష్టదాయకంగా తయారైంది. వారి కుటుంబాల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. హెచ్1బి వీసాదారుల్లో 71 శాతం మంది మన దేశస్థులే. ఇరవై నాలుగ్గంటలలోనే కొత్త రుసుం అమల్లోకి రావడంతో వేలాది మంది యువత దిక్కుతోచని స్థితికి లోనైంది. మన విదేశాంగ శాఖ కనబర్చిన ప్రతిస్పందన యువతకు ఆశాజనకంగా లేదు. అమెరికా నిర్ణయాన్ని గట్టిగా ప్రతిఘటించాల్సిన ఈ సమయంలో మోడీ స్వదేశీ వస్తువులు, స్వావలంబన మాటలు చెప్పడం దారుణం. అమెరికా భారతదేశ వస్తువుల దిగుమతులపై సుంకాలు వేసిన సందర్భంలోనూ మోడీ సర్కార్ ఇలాగే తటపటాయింపు ధోరణిని అవలంబించింది. ట్రంప్– ప్రధాని మోడీ ఫోన్‌లో తరచూ 'హారు' చెప్పుకుంటారని, పరస్పరం జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకుంటారని అమిత ప్రచారం సాగుతున్న దశలో హెచ్1 బి వీసాల ఫీజు తగ్గింపుపై మోడీ ఎందుకు ట్రంప్‌పై ఒత్తిడి చేయలేకపోతున్నారో ఆయన చెబితేనే తెలుస్తుంది. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు సహా పలు అంశాలపై వచ్చే నెలలో మోడీ, ట్రంప్ మధ్య కీలక సమావేశం ఉంటుందంటున్నారు. ఆ సమావేశంలో అమెరికా, ట్రంప్ పెట్టే ఒత్తిళ్లకు, బెదిరింపులకు భారత ప్రభుత్వం, ప్రధాని లొంగకుండా భారత దేశ ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు పూచీ పడాలి.

# స్పీడ్ పోస్టు సర్వీస్‌లో పెను మార్పులు...

పోస్టాఫీసు స్పీడ్ పోస్టు సర్వీస్ లో పెను మార్పులు తీసుకొచ్చింది. సర్వీస్ ఛార్జీలను పెంచింది. డెలివరీ విధానంలో కూడా మార్పులు చేసింది. ఓటీపీ, ఎస్ఎంఎస్ ద్వారా డెలివరీ చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోనుంది. ఈ మార్పులు అక్టోబర్ 1నుంచి అమలులోకి రానున్నాయి. పోస్టల్ డిపార్ట్ మెంట్ 1986లో స్పీడ్ పోస్ట్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. స్పీడ్ పోస్టు ద్వారా అందించే లెటర్లు, ఇతర సమాచారం పత్రాలును అందించడంలో కొత్త ఫీచర్లను ప్రవేశపెట్టినట్లు పోస్టల శాఖ ప్రకటించింది. ప్రైవేట్ కొరియర్ కంపెనీలకు ధీటుగా పోస్టల్ డిపార్ట్ మెంట్ తన సేవలను అందిస్తోంది. అందులో భాగంగా స్పీడ్ పోస్ట్ టారిఫ్‌లను చివరిసారిగా 2012 లో సవరించారు. తాజాగా పెరుగుతున్న ఖర్చులు, నిర్వహన భారం నుంచి వెసులుబాటు పొందేందుకు కొత్తగా సర్వీస్ ఛార్జీలను సవరించింది. స్పీడ్ పోస్ట్ (పత్రాలు/పార్శిల్‌లు) కోసం రిజిస్ట్రేషన్ అందుబాటులోకి తెచ్చారు. చిరునామాదారునికి లేదా వారి అధీకృత ప్రతినిధికి మాత్రమే డెలివరీ చేయనున్నారు. చిరునామాదారులు ఓటీపీని ధృవీకరించిన తర్వాత మాత్రమే స్పీడ్ పోస్టును డెలివరీ చేస్తారు. విద్యార్థులకు టారిఫ్‌పై10శాతం మినహాయి ంపు ఇవ్వనున్నారు. ఎస్ఎంఎస్ ద్వారా వినియోగదారులు డెలివరీ సంబంధిత సమాచారాన్ని చేరవేయనున్నారు. వినియోగదారులకు ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం కూడా అందించనున్నారు. రియల్ టైమ్ డెలివరీ అప్‌డేట్‌ను కూడా తెలుసుకోవచ్చు.

**కొత్త టారిఫ్ రేట్లు.. :**పోస్టల్ శాఖ స్పీడ్ పోస్ట్ ఛార్జీలను సవరించింది. 1-50 గ్రాముల వరకు ఉన్నవస్తువులకు లోకల్ అయితేరూ.19, 2వేల కిలోమీటర్ల వరకు రూ.47చొప్పునా వసూలు చేస్తారు. 51-250




గ్రాముల బరువున్న వస్తువులకు లోకల్ అయితే రూ.24. 200 కిలోమీటర్లకు వరకు రూ.59. 201-500 కిలోమీటర్ల వరకు రూ. 63. అలాగే 501-1000 కిలోమీటర్ల వరకు రూ.68. 1001-2 వేల కిలోమీటర్ల దూరం ఉంటే రూ.72 చొప్పునా చెల్లించాలి. 2వేల కిలోమీటర్ల పైన దూరం ఉంటే రూ.77 చొప్పునా చెల్లించాలి. 251-500 గ్రాముల వరకు బరువున్న వస్తువులకు స్థానిక(లోకల్)కు రూ.28. అలాగే 200 కిలోమీటర్ల వరకు రూ.70. 201- 500 కిలోమీటర్ల వరకు రూ.75. 501- 1000 కిలోమీటర్ల వరకు రూ.82 చొప్పునా వసూలు చేస్తారు. అలాగే రూ.1001- 2 వేల కిలోమీటర్ల దూరాలకు రూ. 86. 2వేల కిలోమీరట్ల కంటే ఎక్కువ దూరం ఉంటే రూ.93 చొప్పున ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అదనంగా జీఎస్టీ వసూలు చేయనున్నారు.

# పత్తి కొనుగోలుకు సీసీఐ యాప్



**అదిలాబాద్,తెలంగాణ దిశ :** రైతులు పత్తి అమ్ముకోవాలంటే మధ్యవర్తుల దోపిడి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇలాంటివాటికి చెక్ పెట్టేందుకు సీసీఐ కొత్త యాప్ విధానం తీసుకొచ్చింది. 'కపాస్ కిసాన్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ సీజన్ రైతులు పంట అమ్ముకునేదుకు తమ వివరాలు, పంట సాగుకు సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేసి స్లాట్ బుక్ చేయాలి.ఇలా చేయడం ద్వారా సెంటర్ల వద్ద రైతుల రద్దీని కంట్రోల్ చేయడమే కాకుండా.. అక్రమాలను అడ్డుకోవచ్చని సీసీఐ అనుకుంటోంది. కపాస్ కిసాన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత రైతు పేరు, జండర్, డేట్ ఆఫ్ బర్త్, క్యాస్ట్, అడ్రస్, ఆధార్, మె?బైల్ నంబర్, అడ్రస్‌తో రిజిస్టర్ అవ్వాలి. అనంతరం ఏ మార్కెట్‌లో పత్తి అమ్మాలనుకుంటున్నారో ఆ వివరాలు ఎంటర్ చేయాలి.అంతేకాదు భూమి సొంతమా, కౌలుదారా చెప్పాలి. పట్టాదారు పాస్ బుక్ నెంబర్, సర్వే నెంబర్, కౌలత రకం, రైతుకు ఉన్న మె?త్తం భూమి, పత్తి సాగు విస్తీర్ణం, పంట రకం లాంటి వివరాలు ఇవ్వాలి. రైతు ఆధార్ కార్డు, పాస్‌బుక్, రైతు ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వీటన్నింటితో కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేయాలి. మార్కెట్, తేదీ, టైమ్‌లోనే రైతుకు సంబంధించిన పత్తి కొనుగోళ్లను అనుమతి ఇస్తారు. సెంటర్ల వద్ద రైతులు వెయిట్ చేయాల్సిన పరిస్థతి తప్పుతుంది. స్మార్ట్‌ఫోన్, వ్యవసాయ అధికారుల వద్ద స్లాట్ బుక్ చేసుకోవచ్చు.పారదర్శకంగా పత్తి సేకరణ, మధ్యవర్తులను అరికట్టడానికి, రైతుల భాగస్వామ్యాన్ని క్రమబద్ధీకరించడానికి సీసీఐ కపాస్ కిసాన్ యాప్‌ను తీసుకొచ్చింది. గతంలో వ్యాపారులు రైతుల నుండి తక్కువ ధరలకు పత్తిని కొనుగోలు చేసి, తరువాత దానిని సీసీఐకి కనీస మద్దతు ధరకు విక్రయించారు. ఇప్పుడు కార్పొరేషన్ ఈ పద్ధతిని అరికట్టాలని యోచిస్తోందిమెదక్ జిల్లాలోని ఎంపిక చేసిన కొనుగోలు కేంద్రాలలో యాప్ ఆధారిత సేకరణను పైలట్ ప్రాతిపదికన ప్రవేశపెడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ సంవత్సరం 4.93 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 3.50 లక్షల ఎకరాలు సాగు చేశారు. సిద్దిపేటలో రైతులు 1.08 లక్షల ఎకరాల్లో, మెదక్‌లో కేవలం 35,000 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు తెలుస్తోంది.

# ఏడుగురు సంతకాలు పెట్టేస్తున్నారే




విజయవాడ, : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు డబుల్ గేమ్ ఆడుతున్నారా? అధినేతకు ఒప్పించుకోలేక సతమతమవుతున్నారా? శాసనసభకు హాజరవుతున్నారా? హాజరైతే సభలో ఎందుకు కనిపించరు? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. మంత్రి నారా లోకేష్ వైసీపీ ఎమ్మెల్యేల హాజరుపై మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ శపథం చేసిందని.. అప్పట్లో సభకు హాజరు కాలేదని.. కానీ ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి శపథం చేశారని.. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు సభకు వచ్చామని చెప్పి సంతకాలు పెడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. దీంతో కొంతమంది వైసీపీ ఎమ్మెల్యేలు సంతకాలు పెట్టడం పై చర్చ ప్రారంభం అయింది. జగన్మోహన్ రెడ్డి మాత్రం తమకు ప్రతిపక్ష హోదా ఇచ్చేవరకు సభకు హాజరు కామంటున్నారు. ఈ నేపథ్యంలో లోకేష్ ప్రకటన పొలిటికల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. సంఖ్యా బలంగా ప్రతిపక్ష హోదాకు ఈ సంఖ్య సరిపోదు. అయితే తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు హాజరవుతానని జగన్మోహన్ రెడ్డి తేల్చి చెప్తున్నారు. అయితే ప్రతిపక్ష హోదా అనేది తాము ఇచ్చేది కాదని సీఎం చంద్రబాబు చెబుతున్నారు. కోర్టుకు వెళ్లి తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. ఇంకోవైపు వైసీపీ ఎమ్మెల్యేలు మాత్రం సభకు హాజరు కావాలని కోరుకుంటున్నారు. జగన్మోహన్ రెడ్డికి ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఆయన రాజకీయ కారణాలు చెప్పి వారికి చెక్ చెపుతున్నారు. ఇటువంటి తరుణంలో ఏం చేయాలో వైసీపీ ఎమ్మెల్యేలకు పాలు పోవడం లేదు. అందుకే వారు అసెంబ్లీకి వచ్చి సంతకాలు పెట్టి వెళ్ళిపోతున్నట్లు తెలుస్తోంది.వాస్తవానికి వారంతా కొత్తగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారే. 11 మంది ఎమ్మెల్యేలు ఏడుగురు కొత్తగా శాసనసభకు ఎన్నికయ్యారు. ఆపై ఆర్థికంగా అంత శ్రీమంతులు కూడా కాదు. సభలో అడుగుపెట్టి అధ్యక్షా అనాలని ప్రతి ఒక్కరికి ఉంటుంది. కానీ తమ అధినేత జగన్మోహన్ రెడ్డి మాత్రం తమను అదుపు చేస్తున్నారన్న బాధ వారిలో ఉంది. పోనీ కూటమి పార్టీలోకి జంప్ చేస్తామంటే అటు నుంచి ఆహ్వానాలు లేవు. అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు పాటిస్తే అనర్హత వేటు పడుతుందన్న భయం వారిలో ఉంది. ఇంకోవైపు జీతభత్యాలు సైతం కోల్పోతారు.

ఇటువంటి పరిస్థితుల్లో జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు పాటించలేక.. సభ లోపలికి వెళ్లలేక.. సంతకాలు పెట్టి వస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. వైసీపీ ఎమ్మెల్యేలు డబుల్ గేమ్ ఆడుతున్నట్లు కూడా స్పష్టం అవుతోంది. కానీ జగన్ మోహన్ రెడ్డి ఇవేవీ పట్టించుకోవడం లేదు.

ఒకసారి శాసనసభ అధికారులకు కానీ.. సిబ్బందిని కానీ సంప్రదిస్తే ఎంతమంది వైసీపీ నేతలు వచ్చి సంతకం పెడుతున్నారు అన్నది తేలిపోనుంది. కానీ జగన్మోహన్ రెడ్డి అంత సాహసం చేయడం లేదు. అలాగని తమ పార్టీ ఎమ్మెల్యేలు సభకు వెళ్లి సంతకాలు పెడుతున్న విషయం ఆయనకు తెలియదు అని కూడా అనలేము.

# ఆమె ధిక్కారం.. గొప్ప మార్పుకు ఆరంభం

అమ్మాయి 'వద్దు అందంటే వద్దనే' అర్థం.. అని కచ్చితంగా, కరాఖండిగా చెబుతున్న కాలం ఇది. కానీ, 19వ శతాబ్దంలో అమ్మాయి పరిస్థితి అలా లేదు. వివాహం ఆమె ఎంపిక కాదు. అది ఓ శాసనం. నిండా పదేళ్లు కూడా లేకుండా ఆడపిల్లకి పెళ్లి చేయడం అప్పుడు ఆనవాయితీ. సామాజిక కట్టుబాట్లకి లొంగిపోయిన ఎందరో ఆడపిల్లలు పట్టుమని ఇరవై ఏళ్లు కూడా నిండకుండా రెండు, మూడు గర్భస్రావాలతో, అరడజను మందికి పైగా పిల్లల తల్లులు. ఇంకా ఇలాంటి ఘోరాలు అప్పట్లో ఎన్నో.. ఆ పరిస్థితులని ధిక్కరించడం ఏ అమ్మాయి కలలో కూడా ఊహించని పరిణామం. కానీ, రుక్మాబాయి రౌత్ ఆ పనిచేసింది. బాల్యంలో తనకి జరిగిన వివాహాన్ని రద్దు చేయమని కోర్టుని ఆశ్రయించింది. 'జైలుకైనా వెళతా కాని భర్తతో కాపురానికి వెళ్లన'ని కరాఖండిగా చెప్పింది. ఈ సాహసం చేసినందుకు సమాజం ఆమెని ఎంతో అవమానించింది. అంతకుమించి నిందలు మోపింది. అయినా రుక్మా తన నిర్ణయాన్ని విడిచిపెట్టలేదు. పోరాడింది. సాధించింది. అలా భారత్‌లో తొలి విడాకులు తీసుకున్న మహిళగా చరిత్రల్లో తన పేరుని శాశ్వతంగా లిఖించుకుంది. ఆ రోజు ఆమె తీసుకున్న ఆ నిర్ణయం వెనుక తన ప్రయోజనం కంటే సమాజాన్ని బాగు చేయాలనుకున్న తపనే కనిపిస్తుంది. సెప్టెంబరు 25న ఆమె వర్ధంతి.


రుక్మాబాయి పుట్టేనాటికి ఆమె తల్లి వయసు 15 ఏళ్లు. 1864 జయంతి బాయి, జనార్ధన్ పాండురంగ్ దంపతులకు ఆమె జన్మించింది. రుక్మాకి రెండేళ్లు వచ్చేసరికి తండ్రి చనిపోయాడు. ఆమెకి 8 ఏళ్లప్పుడు తల్లి జయంతిని ప్రముఖ వైద్యుడూ, వృక్ష శాస్త్రవేత్త, సంఘసంస్కర్త అయిన డా. సఖరాం అర్జున్ రెండో వివాహం చేసుకున్నారు. వితంతు వివాహం ద్వారా గొప్ప మార్పుని స్వాగతించిన సఖరాం, జయంతి బిడ్డ అయిన రుక్మాని బాల్య వివాహం నుంచి తప్పించలేకపోయారు.

రుక్మాకి 11 ఏళ్లువచ్చేసరికి తనకంటే 8 ఏళ్లు పెద్దవాడైన దాదాజీ భికాజీతో వివాహం చేశారు. యుక్తవయసు వచ్చిన తరువాతే అత్తింటికి వెళ్లేలా ఒప్పందం పెట్టుకున్నారు. సవితి తండ్రి సఖరాం చొరవతో రుక్మా చదువులో రాణించింది. కానీ, భికాజీ చెడు సావాసాలకు అలవాటు పడ్డాడు. రజస్వల అయిన రుక్మాని కాపురానికి పంపమని ఒత్తిడి చేశాడు. కానీ రుక్మా ససేమిరా అంది. ఆ ధిక్కరణ అప్పట్లో పెద్ద విప్లవం. భర్త ఆజ్ఞాపిస్తే భార్య కాదనడం బరితెగించడం. ఈ ధోరణిని నిరసిస్తూ భికాజీ కోర్టు ద్వారా భార్యని లొంగదీసుకోవాలని చూశాడు. అయినా రుక్మా భయపడలేదు.

1885లో రుక్మా వర్సెస్ భికాజీ కేసు బొంబాయి హైకోర్టుకి వచ్చింది. ఆమె భర్తతో ఇంటికి వెళ్లాలని, లేనిపక్షంలో జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వచ్చింది. అప్పుడు తాను 'జైలుకైనా వెళతా కానీ, భికాజీతో వెళ్లే ప్రసక్తి లేద'ని రుక్మా గట్టిగా నిలబడింది.

# ఆరోగ్య శ్రీ సేవలపై డోలాయామానం!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణలో 1400 కోట్ల రూపాయల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించడంతోపాటు ఆసుపత్రిలో సేవల ధరలు 20శాతం పెంచాలని డిమాండ్ చేస్తూ గత రెండు రోజులుగా ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులు సేవలు నిలివేస్తున్నట్లు ప్రకటించారు. అయితే తాజాగా జరుగుతున్న పరిణామాలు రోగులను అయోమయంలో పడేస్తున్నాయి.ప్రవేటు ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడంపై రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఆసుపత్రులలో సేవలు కొనసాగిస్తూ, వేరేవాటిలో మాత్రం సేవలు నిలివేవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే ఆరోగ్యశ్రీ సేవలపై ప్రభుత్వం స్పందిస్తూ కేవలం 13శాతం ఆసుపత్రులలో మాత్రమే ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోయాయని, మిగతా ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ వైద్యం అందుతోందని అంటోంది. ఇలా విభిన్న ప్రకటనల ద్వారా ఆరోగ్యశ్రీ సేవల విషయంలో సందిగ్ధం నెలకొంది.వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 2008లో ఆరోగ్యశ్రీ పథకం అమల్లోకి వచ్చింది. పేదలకు మెరుగైన కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందిచాలనే లక్ష్యంతో మొదలైన ఈ పథకం తరువాతి కాలంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంది, నేటికీ ఎదుర్కొంటూనే ఉంది. వైఎస్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆరోగ్యశ్రీ పథకం ఆయన మరణం తరువాత రోశయ్య హాయంలో కొంతకాలం ఆటంకాలు లేకుండా కొనసాగింది. ప్రవేటు ఆసుపత్రులకు బిల్లులు చెల్లించడం కోసం అప్పట్లో ఈ పథకం కొ?సం ప్రత్యేకంగా గ్రీన్ చానెల్ ఏర్పాటు చేసి మరీ 45 రోజుల్లోపే ప్రవేటు ఆసుపత్రులకు బకాయిలు విడుదల చేసేవారు. అప్పట్లో ఐఎఎస్ అధికారి బాబు ప్రత్యేక చొరవతో ఆసుపత్రులకు ఎటువంటి ఇబ్బందులు రాలేదు.2014 తరువాత పరిస్దితులు పూర్తిగా మారిపోయాయి. పెరుగుతున్న వేతనాలు, ఆసుపత్రి నిర్వహణ వ్యయం దృష్టిలో పెట్టుకుని ప్రతీ రెండేళ్లకోసారి రివ్యూచేసి , 20శాతం వైద్య సేవల ఖర్చు పెంచాలని ప్రవేటు ఆసుపత్రులు చేసిన వినతిని పరిగణలోకి తీసుకున్న అప్పటి ప్రభుత్వం , ఖచ్చితంగా పెంచుతామని హామీ ఇచ్చింది. అది మొదలు నేటి వరకూ ఒక్కసారి కూడా వైద్యసేవల ఖర్చు పెంపుపై కనీసం రివ్యూ చేసిన దాఖలాలు లేవు. 20శాతం కాదుకదా, పైసా కూడా పెంచిన పరిస్దితి లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ ముఖ్య మంత్రి హోదాలో ఆరోగ్యశ్రీపై కనీసం ఒక్కటంటే ఒక్క సమీక్ష నిర్వహించలేదని నెట్ వర్క్ ఆసుపత్రులు ఆరోపిస్తున్నాయి. ఏళ్లతరబడి పేరుకుపోయిన నెట్ వర్క్ ఆసుపత్రుల సమస్యలు కనీసం పరిష్కారం



దిశగా ఒక్క అడుగు పడలేదంటున్నారు. హరీష్ రావు మంత్రిగా ఉన్న సమయంలో కొంత వరకూ నిధులు విడుదల చేశారు. గత రెండేళ్లుగా పాత బకాయిలు పూర్తిగా చెల్లించడం మానేశారు. ఇలా కర్ణుడి చావుకి వంద కారణాలు అన్నట్లుగా వైఎస్ హాయం తరువాత నెమ్మదిగా ఆరోగ్యశ్రీ తీవ్ర నిర్లక్ష్యానికి గురైయ్యిందనేది వాస్తవం. ఒకప్పుడు 20శాతం ఉచితంతో మొదలైన ఆరోగ్యశ్రీ తరువాత కాలంలో బిపిఎల్ లబ్దిదారులకు 80శాతం ఉచితం వైద్యం అందిస్తున్నాం. ఇలా దాదాపు పూర్తి స్దాయిలో క్రెడిట్ పై వైద్యసేవలు అందించడం, 1400కోట్ల రూపాయలు పెండింగ్ బకాయిలు పేరుకు పోవడంతో దిక్కుతోచని స్దితిలో ఆరోగ్యశ్రీ సేవలు నిలివేస్తున్నామని చెబుతున్నాయి నెట్ వర్క్ ఆసుపత్రులు.

# సేంద్రీయ వ్యవసాయం చేస్తే మరో 4 వేలు అదనం



**అదిలాబాద్,తెలంగాణ దిశ :**రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెట్టబడి సాయంగా వివిధ రకాల పథకాల ద్వారా డబ్బులను అందిస్తున్నాయి. అంతే కాకుండా.. పంట నష్టం జరిగితే పరిహారం.. ప్రకృతి వైపరీత్యా ల కారణంగా పంట నష్టపోతే.. బీమాను కల్పిస్తున్నారు. అయితే వ్యవసాయం పంటలకు చీడ పీడల నుంచి రక్షణకు ఎక్కువగా కెమిక ల్స్ ఉపయోగిస్తున్నారు. దీనివల్ల అనారోగ్యానికి గురయ్యే అవకాశాలుఎక్కువగా ఉన్నాయి. ఇలా కాకుండా.. రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది.రైతులకు పెట్టుబడి సాయం, పంట నష్టానికి పరిహారం, బీమా వంటి పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. అయినప్పటికీ.. రైతులు పంటలను తెగుళ్లు, చీడపీడల నుంచి రక్షించుకోవడానికి ఎక్కువగా రసాయన ఎరువులను వాడుతున్నారు. ఈ రసాయనాల వల్ల నేల ఆరోగ్యం క్షీణించడమే కాకుండా, మానవ ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ సమస్యకు పరిష్కారంగా.. ప్రభుత్వాలు రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించేందుకు కృషి చేస్తున్నాయి. దీనిలో భాగంగా.. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఎకరానికి రూ. 4,000 ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. వీటితో పాటు.. తెలంగాణ రైతులకు రైతు భరోసా, రైతు బీమా? లాంటివి కూడా వర్తించనున్నాయి. ఈ పథకం గురించి పూర్తి వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకాన్ని తెలంగాణలో జిల్లాల వారీగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఒక్కో జిల్లాలో క్లస్టర్లను ఏర్పాటు చేసి, ఒక్కో క్లస్టర్‌లో రెండు నుంచి మూడు గ్రామాలను ఎంపిక చేస్తున్నారు. ఒక్కో క్లస్టర్‌లో కనీసం 125 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రైతులకు సహాయం చేయడానికి, ఒక్కో క్లస్టర్ నుంచి ఇద్దరు రైతులను 'కృషి సఖీలు' లేదా 'క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్'గా ఎంపిక చేస్తున్నారు. వీరికి నెలకు రూ. 5,000 వేతనం ఇవ్వనున్నారు. వీరికి శిక్షణ ఇవ్వడానికి మాస్టర్ ట్రైనీలు ఉంటారు. ఈ సంవత్సరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 9,250 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ పథకం ద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది, సాగు ఖర్చులు కూడా తగ్గుతాయి. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం జాతీయ బ్రాండ్ కల్పించి, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుంది. జిల్లాల్లోని పరిశోధనా కేంద్రాలలో నమూనా క్షేత్రాలు ఏర్పాటు చేసి, రైతులకు ప్రత్యక్షంగా శిక్షణ ఇస్తారు. హన్మకొండ జిల్లాలో కూడా ఈ పథకం వేగవంతంగా అమలవుతోంది. జిల్లాలోని పలు గ్రామాలలో క్లస్టర్లను ఏర్పాటు చేసి, రైతులకు శిక్షణ ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైంది.వ్యవసాయానికి అవసరమైన బయో ఎరువులు, జీవ రసాయనాలు అందుబాటులో ఉంచడానికి ప్రతి క్లస్టర్‌కు మూడు బయో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో కేంద్రానికి ప్రభుత్వం లక్ష రూపాయలు అందిస్తుంది. ఈ కేంద్రాలను రైతు సంఘాలు లేదా సహకార సంఘాలు నిర్వహించవచ్చు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 49 బయో కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పథకం వల్ల రైతులు ఆర్థికంగా బలోపేతం కావడమే కాకుండా, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

## నూతన సర్వీసుల మంజూరు వేగవంతం చేయండి...


**– సీఎండీ ముషారఫ్ ఫరూఖీ**

హైదరాబాద్, : నూతన సర్వీస్ కనెక్షన్ల కోసం పెండింగ్ లో వున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, దీని కోసం శనివారం ఇస్తున్న లైన్ క్లియరెన్స్ లను సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, విద్యుత్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 593 ఎల్టీఎం ఓ(అపార్ట్మెంట్/లే అవుట్) దరఖాస్తులు డిపార్ట్మెంట్ వద్ద పెండింగ్ లో వున్నాయి. వాటిని వెంటనే రిలీజ్ చేయాలని ఆదేశించారు. గతం లో నూతన ఎల్టీఎం సర్వీసుల ఛార్జింగ్ కోసం ఫీడర్ ను నిలిపివేసేవారని, దాని వలన సరఫరా లో ఇబ్బందులు ఏర్పడేవన్నారు. నూతన సర్వీసుల ఛార్జింగ్ కోసం ఎప్పుడు పడితే అప్పుడు సరఫరా నిలిపివేయకుండా ఉండేందుకు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినట్టు సీఎండీ తెలిపారు.

# ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్యే!

**శ్రీకాకుళం,తెలంగాణ దిశ :**ఏపీలోకూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతోంది. మూడు పార్టీలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. మరో 15 ఏళ్ల పాటు కూటమి కొనసాగుతుందని అధినేతలు భావిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తుంటే అందుకు విరుద్ధంగా ఉంది. మూడు పార్టీల సమన్వయ లోపం స్పష్టమవుతోంది. ఏకంగా అసెంబ్లీ వేదికగా బిజెపి ఎమ్మెల్యే ఒకరు.. టిడిపి ఎమ్మెల్యే పై ఆవేదన వ్యక్తం చేశారు. తనపై కుట్రలు చేస్తున్నారని.. వైసీపీ నేతలతో చేతులు కలిపారని.. వ్యతిరేక మీడియాలో కథనాలు రాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసే పరిస్థితి వచ్చింది. కూటమి పార్టీల్లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్ అవుతోంది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు.. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పై అసెంబ్లీ వేదికగా సంచలన ఆరోపణలు చేశారు.శ్రీకాకుళం జిల్లాలో పొత్తులో భాగంగా ఎచ్చెర్ల స్థానాన్ని బిజెపికి కేటాయించారు. ఆ పార్టీ అభ్యర్థిగా నడికుదుటి ఈశ్వరరావు పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగు పెట్టారు. అయితే ఎచ్చెర్ల నియోజకవర్గంలో క్వారీలు అధికంగా ఉంటాయి. ఈ తరుణంలో గత వైసీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున క్వారీలకు అనుమతులు ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా అప్పట్లో అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ మరుసటి రోజే ఓ క్వారీ తవ్వకాలకు సంబంధించి వైసీపీ నేతకు భూగర్భ గనుల శాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. సదరు నేత క్వారీలో గ్రావెల్ తవ్వకాలకు సిద్ధపడగా స్థానికులు అడ్డుకున్నారు. అదే విషయంపై ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఆయన సైతం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. క్వారీకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఇవ్వొద్దని సూచించారు. అప్పటినుంచి వివాదం నడుస్తూనే ఉందిఅయితే సదరు క్వారీ యాజమాన్యం నుంచి ఎచ్చర్ల ఎమ్మెల్యే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని.. ముడుపులు ఆశిస్తున్నారని.. ఇవ్వకపోవడం వల్లే ఎమ్మెల్యే వ్యతిరేకిస్తున్నారు అంటూ ప్రభుత్వ వ్యతిరేక మీడియాలో కథనాలు వస్తున్నాయి. అయితే సదరు క్వారీ యజమాని కి అనుకూలంగా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వ్యవహరిస్తున్నారు.

# వైసీపీలో నెంబర్ 2 రచ్చ




**తిరుపతి,తెలంగాణ దిశ:**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో జగన్ తరువాత ఎవరు? అధినేత తరువాత స్థానం ఎవరిది? జగన్మోహన్ రెడ్డికి అండగా నిలిచేది ఎవరు? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. వైసిపి ఆవిర్భావం నుంచి జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఒక వలయం పనిచేసింది. విజయసాయిరెడ్డి, వై వి సుబ్బారెడ్డి, సజ్జల రామకృ ష్ణారెడ్డి, పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి.. ఇలా ఒక రక్షణ వలయం ఉండేది. కానీ ఇప్పుడు కొందరు నేతలు పార్టీకి దూరమయ్యారు. మరికొందరు కేసుల్లో చిక్కుకొని జైలు పాలు అయ్యారు. ఈ క్రమంలో జగన్మోహన్ రెడ్డి ఒంటరి అయ్యారు. సజ్జల రామకృష్ణారెడ్డి లాంటి వారు ఉన్నా.. జగన్మోహన్ రెడ్డి సొంత మనుషులకు నియమించుకోవాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రధానంగా మారిన రాజకీయ పరిస్థితులు, ముసురు కొస్తున్న కేసులు దృష్ట్యా జగన్మోహన్ రెడ్డి ముందు ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తన భార్య భారతి రెడ్డిని రాజకీయాల్లోకి తేవాలని.. పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉన్న సమయంలో కుటుంబ సభ్యులు ఎవరు రాజకీయాల్లోకి రాలేదు. ముఖ్యంగా కుటుంబంలో మహిళలు రాజకీయాలకు దూరంగా ఉండేవారు. కానీ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో.. జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడేందుకు ముందుకు వచ్చారు తల్లి విజయమ్మ, చెల్లెలు షర్మిల. కొడుకు కోసం పులివెందులలో పోటీ చేశారు విజయమ్మ. కాంగ్రెస్ అధినాయకత్వంతో విభేదించి మరి రంగంలోకి దిగారు. చెల్లెలు షర్మిల అయితే ఊరు వాడ ప్రచారం చేశారు. అన్న జగన్మోహన్ రెడ్డి కోసం ఏకంగా పాదయాత్ర చేశారు. తన అన్న జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చేందుకు పరితపిం చారు. కానీ ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డికి తల్లి, చెల్లి ఇద్దరూ దూరమయ్యారు.జగన్మోహన్ రెడ్డితో సుదీర్ఘకాలం ప్రయాణం చేశారు విజయసాయిరెడ్డి. రాజకీయాల్లోకి రాకమునుపే జగన్మోహన్ రెడ్డితో మంచి సంబంధాలు కొనసాగించేవారు. ఈ క్రమంలోనే జగన్ అవినీతి కేసుల్లో విజయసాయిరెడ్డి కూడా 16 నెలలు పాటు జైల్లో ఉండి పోయారు. వైసిపి ఆవిర్భావంలో విజయసాయిరెడ్డి పాత్ర కీలకం. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు అన్ని విధాల కృషి చేశారు విజయసాయిరెడ్డి. జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరిచే క్రమంలో విజయసాయిరెడ్డి చేసే కృషి అంతా అంతా కాదు. అటువంటి విజయసాయిరెడ్డి ఇప్పుడు పార్టీకి గుడ్ బై చెప్పారు. మరోవైపు బాబాయ్ వైవి సుబ్బారెడ్డి యాక్టివ్ గా లేరు. పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సైతం అరెస్ట్ అవుతారని ప్రచారం నడుస్తోంది. ఇటువంటి సంక్లిష్ట సమయం కొనసాగుతున్న నేపథ్యంలో.. తనకు అండదండగా నిలిచేందుకు తన భార్య భారతి రెడ్డిని జగన్ రంగంలోకి దించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే భారతి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో తరచూ ఫోన్లో మాట్లాడుతూ పార్టీ స్థితిగతులను తెలుసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# ఇడ్లీ, దోశెపై జీఎస్టీ వద్దు



చెన్నై, : గతంలో అనేక స్లాబులున్న జీఎస్టి లో సరళీకృతం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేవలం రెండు స్లాబులు మాత్రమే ప్రకటిస్తూ నిర్ణయం తీసుకుంది. అది నిన్నటి నుంచి అమల్లోకి వచ్చింది. ఇది దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని.. పన్ను విధానంలో సరికొత్త చరిత్రకు నాంది పలుకుతుందని మోడీ ప్రకటించారు. ప్రజల జీవన విధానంలో కూడా మార్పు వస్తుందని.. ప్రజల ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ జీఎస్టీ విధానంలో మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలలో నిరసనకు కారణమవుతోంది.దక్షిణాది రాష్ట్రాలలో కర్ణాటకలో కాంగ్రెస్, తెలంగాణలో కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్లో కూటమి, తమిళనాడులో డిఎంకె, కేరళలో వామపక్ష పార్టీ అధికారంలో ఉన్నాయి. కర్ణాటక మినహా మిగతా రాష్ట్రాలలో బిజెపి ఇంతవరకు సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. ఏర్పాటు చేసేందుకు అడుగులు వేస్తున్నప్పటికీ అవి అంతగా ఫలప్రదం కావడం లేదు. దక్షిణాది రాష్ట్రాల ప్రజల అవసరాలు ఏమిటో.. ఏ విధంగా అయితే వారు ఆదరిస్తారో ఇప్పటివరకు బిజెపికి ఒక దిశ అంటూ లేకుండా పోయింది. పైగా నాయకత్వం మార్పులను ఎప్పటికప్పుడు చేపడుతూ ఉండడం ఇక్కడి రాష్ట్రాలలో బిజెపికి దెబ్బగా మారింది. అటువంటి వాటి నుంచి గుణ పాఠాలు నేర్చుకోకపోగా.. మరింత పనికిమాలిన నిర్ణయాలను బిజెపి ప్రభుత్వం తీసుకుంటున్నది. అది అంతిమంగా ఇక్కడ ప్రజల జీవితాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తోంది.కేంద్ర ప్రభుత్వం తాజాగా జిఎస్టి విషయంలో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ దక్షిణాది ప్రజలు ఇష్టంగా తినే ఇడ్లీ, దోశలపై జీఎస్టీ విధానాన్ని యధావిధిగా ఉంచడం పట్ల నిరసన వ్యక్తం అవుతుంది. ఉత్తరాది రాష్ట్రాలలో తినే చపాతి, పరోటా పై జిఎస్టి లేకుండా కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో దక్షిణాది రాష్ట్రాలలో ప్రజలు ఇష్టంగా తినే ఇడ్లీ, దోశలపై ఐదు శాతం జిఎస్టి విధానాన్ని అమలు చేయడం పట్ల ఇక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తర రాష్ట్రాలలోని ప్రజల తినే అల్పాహారాలపై పన్ను తొలగించి.. ఇక్కడి ప్రజలు తినే వంటకాలపై వివక్ష చూపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ విషయాన్ని ఏపీ శాసనసభలో ఎమ్మెల్యే రామకృష్ణ ప్రస్తావించారు. అయితే దానిపై కూటమినేతలు ఎటువంటి మాటలు మాట్లాడలేదు. మరోవైపు కొందరు దక్షిణాది వంటకాలపై కేంద్రం కక్ష కట్టిందని.. జీఎస్టీతో ప్రజల తినే ఆహారంపై కూడా ఉక్కు పాదం మోపుతోందని ఆరోపిస్తున్నారు. కేంద్రం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు

# పార్టీ మారితే కేసులు ఉండవా

**ఏలూరు,తెలంగాణ దిశ :**రాజకీయాలు అంతే... రాజకీయాల్లో ఓపిక.. సహనం అవసరం.. అధికారం లేకపోతే పార్టీ మారితే ఎవరూ కేర్ చేయరు. పక్కన ఉండే నలుగురైదుగురు కోటరీ నాయకులు తప్ప ఎవరూ పెద్దగా కలిసేందుకు కూడా ఆసక్తి చూపరు. ప్రస్తుతం మాజీ మంత్రి ఆళ్లనాని పరిస్థితి అలాగే తయారైంది. ఆళ్ల నాని వైసీపీలో ఒక వెలుగు వెలిగారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా ఏదో ఒక పదవి పొందారు. అలాగనుకుంటే వైసీపీ అధికారంలోకి రాకముందే ఆళ్లనానిని జగన్ ఎమ్మెల్సీ చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ చీఫ్ జగన్ తన కేబినెట్ లో చోటు కల్పించడమే కాకుండా మొదటి విడతలోనే వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా చేశారు. అయితే వైసీపీ అధికారం కోల్పోవడంతో ఆళ్లనాని వైసీపీని వీడి టీడీపీలో చేరిపోయారు.... తొలి నుంచి ఆళ్ల నాని టీడీపీ చేరికకు ఆ పార్టీ నేతలు అంగీకరించలేదు. ఏలూరు జిల్లా టీడీపీ నేతలు ఆళ్ల నాని పార్టీలో చేరికపై తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో పలు సార్లు ఆయన చేరికకు బ్రేకులు పడినా చివరకు పార్టీ నాయకత్వం ఏలూరు జిల్లా నాయకులకు నచ్చ చెప్పి పార్టీ కండువా కప్పేసింది. సీనియర్ నేతల నుంచి ద్వితీయ శ్రేణి నేతల వరకూ ఆళ్ల నాని పార్టీలో చేరడాన్ని ఇప్పటికీ జీర్ణించుకోవడం లేకపోతున్నారు. అసలు జిల్లాలో ఆళ్లనాని అంటూ ఒక నేత ఉన్నారన్న విషయం ఇటు టీడీపీ నేతలతో పాటు ఆయన అనుచరులు కూడా మర్చిపోయారట. ఏలూరు జిల్లాను ఒకప్పుడు వైసీపీ హయాంలో శాసించిన నాని ఇప్పుడు వేళ్లు విరుచుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. పార్టీలో చేరి ఎనిమిది నెలలు కావస్తున్నా బయటకు రావడం లేదు. చివరకు పార్టీ కార్యక్రమాలకు కూడా ఆళ్లనానికి పిలుపులు లేవు.

అసలు ఆళ్లనానిని తమ నాయకుడిగా టీడీపీ నేతలు గుర్తించడం లేదు.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తమపై పెట్టిన అక్రమ కేసులకు ఆళ్ల నాని ప్రధాన కారణమని భావించడం వల్లనే అంతటి వ్యతిరేకతను టీడీపీ క్యాడర్, లీడర్ల నుంచి ఆళ్ల నాని ఎదుర్కొంటున్నారు. అలాగని నిన్న గాక మొన్న పార్టీలో చేరి స్థానిక నాయకత్వం తీరుపై అధినాయకత్వానికి ఫిర్యాదు చేసే పరిస్థితి కూడా లేదు. దీంతో ఆళ్ల నాని అనవసరంగా పార్టీ మారానా? అన్న బాధలో ఉన్నారట. వచ్చే ఎన్నికల్లో ఆళ్ల నానికి టీడీపీ టిక్కెట్ దొరకడం కూడా కష్టమేనని అంటున్నారు. దీంతో ఆళ్లనాని మరొకసారి జగన్ కు దగ్గరయ్యే ప్రయత్నాలు కూడా చేస్తున్నారంటున్నారు.

# ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

**- అపోలో ఫార్మసీలు నమ్మకానికి, సేవకు ప్రతీకలు**

**- వరల్డ్ ఫార్మసిస్టుల దినోత్సవంలో విసి డా. వినోద్ భట్**


**చిత్తూరు,తెలంగాణ దిశ :**ఆరోగ్య రంగంలో విశేష కృషికి అంకితం అయిన ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం ? 2025ను అపోలో విశ్వవిద్యాలయం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ ముఖ్య అతిథిగా హాజరై ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రాజ్వలనతో ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా డా. వినోద్ భట్ మాట్లాడుతూ... ఔషధ నిపుణులు ఆరోగ్య రంగంలో కీలక భాగస్వాములు. రోగుల ఆరోగ్య సంరక్షణ, మందుల సురక్షిత వినియోగం, నాణ్యత మరి యు సరైన సూచనల విషయంలో వారి పాత్ర అపారమైనది. కోవిడ్ సమయంలో ఫార్మసిస్టుల సేవలు సమాజంలో విశేష గుర్తిం పు పొందాయి. ఫార్మసిస్టులు కేవలం మందులు ఇవ్వడమే కాదు, ప్రజల్లో మందుల వినియోగంపై అవగాహన కల్పించడం, దుష్ప్రభావాలను నివారించడం కూడా వారి బాధ్యత అని పేర్కొన్నారు. అపోలో ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మసీ నెట్వర్క్‌ను నడుపుతోంది. దేశవ్యాప్తంగా 6,500 మందుల ఔట్‌లెట్లు ఉన్నాయి. ప్రపంచంలోని 12 అగ్రగణ్య ఫార్మసీలలో అపోలో ఒకటి. ఆన్‌లైన్ మెడిసిన్ సేవలలో కూడా అపోలో ముందున్నది. పేషంట్ల ఆరోగ్య పరిస్థితిని ఫోన్ ద్వారా తెలుసుకోవడం, అపోలో ఫార్మసీ సేవల అత్యంత విశ్వసనీయతకు నిదర్శనమని భట్ అన్నారు. ఈ సందర్భంలో అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (ఎఐపీఎస్) డీన్ ప్రొఫెసర్ కె. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. 'ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం మనకు ఫార్మసీ రంగంలోని బాధ్యతలను గుర్తు చేయిస్తుంది. ఫార్మసిస్టులు కేవలం మందులు ఇస్తే సరిపోదు, ప్రజలకు మందుల వినియోగం, భద్రత, ఆరోగ్య పరిరక్షణలో అవగాహన కల్పించడం ముఖ్యం. కోవిడ్ సమయంలో ఫార్మసిస్టుల సేవలు స్ఫూర్తిదాయకం' అని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు

ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించే వీడియో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సృజనాత్మక స్కిట్ ప్రదర్శన ద్వారా ఫార్మసీ రంగంలో అవగాహన, భద్రతా ప్రాధాన్యత గురించి స్పష్టమైన సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో గౌరవ అతిథి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు, డీన్లు డాక్టర్ రామయ్య ఇటుమల్ల, డాక్టర్ జగదీషన్, ఎఐఎంఎస్ఆర్ ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ సచ్చితానంద ఆడిగ, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి, అలయిడ్ హెల్త్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ సుచరిత పి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజశేఖర్, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఊటూరులో తాగునీటి కష్టాలు..!

మానకొండూరు: కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలంలోని ఊటూరు గ్రామంలో ట్యాంక్‌లోకి నీరు స్టోరేజ్ కాకుండా తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. మిషన్ భగీరథ ట్యాంక్‌లోకి నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్గా అరవిందరెడ్డి విధుల్లో ఉన్నప్పటికీ కార్యాల యానికి రాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వాటర్ ట్యాంక్ వద్ద గేట్ వాల్ పాడైపోయి, నీరు లీకేజీ అవ్వడం వల్ల ట్యాంక్‌లోకి నీటి సరఫరాఅంతంతమాత్రంగానే జరుగుతోంది. ఈ సమస్యను పరిష్క రించడానికి సుమారు 20రోజుల కింద పైపులైన్ తవ్వినప్పటికీ మర మ్మతులు మాత్రం జరగడం లేదు. దీంతో తవ్విన కందకం వర్షాలకు కూలిపోతోందని గ్రామస్తులు వాపోతున్నారు.

# యూపిఐ లావాదేవీలపై ఛార్జీలు




**ఎట్టకేలకు తప్పదంటూ ప్రకటించిన ఐసిఐసిఐ?**

న్యూఢిల్లీ: యూపీఐ ఆధారిత లావాదేవీల వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న వేళ ఇటీవల కేంద్రం సుంకాలు విధించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. కానీ ప్రభుత్వం దీనిని తోసిపుచ్చింది. సాధారణంగా యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులపై ప్రస్తుతం ఎలాంటి ఛార్జీలు లేవు. అయితే, అధిక విలువైన డిజిటల్ లావాదేవీలను నిర్వహించేందుకు ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ లావాదేవీలపైనా మర్చంట్ ఛార్జీలను ప్రవేశపెట్టనున్నట్లు- ఇటీవల వార్తలు రాగా.. కేంద్రం వాటిని కొట్టివేసింది. అయితే, గతవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు ఉండాలని అభిప్రాయపడ్డారు.ఇది ఎప్పటికీ ఉచితంగా ఉండకూడదు. దీనిపై ఛార్జీలు అవసరం. ఎవరో ఒకరు వాటిని భరించాలని అన్నారు. ఇప్పుడు చిన్నచిన్న దుకాణాలు మొదలు మాల్స్ వరకు ప్రతిచోటా గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే లావాదేవీలే జరుగుతున్నాయి. దీంతో ఆయా పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు వసూలుచేసేందుకు ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ సిద్ధమైంది. యూపీఐ లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్న పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు విధించనుంది. ఆగస్టు 1వ తేదీ నుంచే ఈ ఫీజులు వసూలుచేయనున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దీనిపై ఈనెల ఆరంభంలోనే పేమెంట్ అగ్రిగేటర్లకు ఐసీఐసీఐ బ్యాంక్ సమాచారమిచ్చినట్లు తెలుస్తోంది. ఐసీఐసీఐలో ఎస్క్రో ఖాతాను నిర్వహించే అగ్రిగేటర్ పై ప్రతి లావాదేవీకి 2 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.6 వరకు ఛార్జీలు విధించనుందట. ఇక, ఎస్క్రో ఖాతా లేనివారైతే.. ఈ ఛార్జీలు రెట్టింపు కానున్నాయి. అంటే ప్రతి లావాదేవీకి 4 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.10 వరకు ఫీజులు వసూలుచేయనున్నట్లు- సమాచారం. ఈ ఛార్జీలతో ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్న మర్చెంట్స్‌పై ఎలాంటి అదనపు భారం పడదు. కేవలం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మర్చంట్స్ కోసం డిజిటల్ పేమెంట్లు- నిర్వహించే పేమెంట్ అగ్రిగేటర్లపై మాత్రమే ఛార్జీలు ఉండనున్నట్లు- ఐసీఐసీఐ తమ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. యూపీఐ లావాదేవీల నిర్వహణకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెల్లించాల్సిన మొత్తాన్ని ఇప్పటివరకు ఐసీఐసీఐ బ్యాంకు భరిస్తోంది. ఈ క్రమంలోనే ఖర్చుల భారాన్ని తగ్గించుకునేందుకు బ్యాంకు ఈ ఛార్జీలు విధిస్తోన్నట్లు- సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మూడేళ్ల ముందు వరకు యూపీఐ ఆధారిత చెల్లింపులను ప్రాసెస్ చేసేందుకు వ్యాపారులు కొంతమొత్తం ఛార్జీలను బ్యాంకులకు కట్టాల్సి వచ్చేది. అది కూడా ఒక శాతం లోపే ఉండేది. అయితే, యూపీఐ చెల్లింపులపై ఈ ఎండీఆర్ ఛార్జీలను 2022లో కేంద్రం తొలగించింది. అనంతరం ఈ ప్రాసెసింగ్ ఖర్చులను భర్తీ చేసేందుకు బ్యాంకులు, ఫిన్టెక్ కంపెనీలకు కేంద్రం సబ్సిడీలు ఇస్తూ వస్తోంది.

# వలస కూలీలు దిక్కు...



**అదిలాబాద్,తెలంగాణ దిశ :** బెజ్జంకి మండలంలో వరి నాట్లు ప్రారంభమైన వేళ కూలీల కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. గతంలో గ్రామాల మహిళలు వరి నాట్లలో చురుకుగా పాల్గొనగా, ఇప్పుడు ఆ దృశ్యం కనిపించడం లేదు. దీంతో గత రెండుమూడేళ్లుగా రైతులు వలస కూలీలపై ఆధారపడుతున్నారు. మహారాష్ట్ర, గడ్చిరోలి, చంద్రాపూర్, బీహార్, చత్తీస్గఢ్, ఒడిశా వంటి రాష్ట్రాల నుంచి వలస కూలీలు వచ్చి వరి నాట్లు వేస్తున్నారు.గ్రామాల్లోని కొందరు రైతులు వీరికి పశువుల పాకలు, పాత ఇళ్ళలో వసతి కల్పిస్తున్నారు. ఒక్క ఎకరాకు రూ.5,000 నుంచి రూ.5,500 వరకు కూలీ గుత్తకు కుదుర్చుకొని రైతులకు నాట్లు వేస్తున్నారు. డిమాండ్ అధికంగా ఉన్న కొన్ని గ్రామాల్లో ఇది రూ.6,000 వరకు పెరిగింది.ఈ సారి వర్షాలు ఆలస్యంగా కురవడంతో నాట్లు ఆలస్యమయ్యాయి.

# సూర్యారావు వర్సెస్ అమూల్య

**రాజమండ్రి,తెలంగాణ దిశ :**అన్నా చెల్లెళ్ల మాటల యుద్ధం, అన్నా దమ్ముళ్ల మధ్య మాటల తూటాలు తెలుగు రాష్ట్రాల్లో ఎప్పటికీ హాట్ టాపిక్ అవుతుంటాయి. సంచలనం.. ఎందుకంటే ఏపీలో అన్నా చెల్లి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వైఎస్ షర్మిలా రెడ్డి రాజకీయ ప్రత్యర్థులుగా మారితే.. తెలంగాణాలో కేటీఆర్, కవిత ల మధ్య ఎటువంటి పొలిటికల్ వాతావరణం నెలకొందో చెప్పనక్కర్లేదు. ఇటువంటి పరిణామాలు కేవలం ముఖ్యమంత్రి స్థాయి కుటుంబాల్లోనే అనుకుంటే పొరపాటే... ఏపీలోని ఓ మాజీ మంత్రి ఇంట్లోనూ తండ్రి, కూతురు మధ్య ఓ చిన్నపాటి యుద్ధ వాతావరణమే నెలకొంది.. దీనికి అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలు నియోజకవర్గం వేదికగా మారింది.. మాజీ మంత్రి, వైసీపీ నేత గొల్లపల్లి సూర్యారావు కుమార్తె గొల్లపల్లి అమూల్య కు రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించడం హాట్ టాపిక్ అవుతోంది. పొలిటికల్ తెరమీద తండ్రి వర్సెస్ కూతురు కథ అందరి దృష్టిలో ఆసక్తిని నెలకొల్పింది.. రాష్ట్ర విభజన, నియోజకవర్గాల పునర్విభజనకు ముందు అల్లవరం ఎస్సీ కానిస్టెన్సీ టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి తొలిసారిగా ఎమ్మెల్యే అయిన గొల్లపల్లి సూర్యారావు 2004లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి గెలుపొంది వైఎస్ రాజశేఖర్ రెడ్డి క్యాబినేట్‌లో మంత్రిగా కూడా పనిచేశారు.. ఆతరువాత కాంగ్రెస్ పార్టీకు రాజినామా చేసి మళ్లీ టీడీపీలో చేరి 2014 ఎన్నికల్లో రాజోలు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు.. 2019లో టీడీపీ తరపున పోటీచేసి ఓటమి చెంది 2024 ఎన్నికలకు కొన్ని రోజుల ముందు వైసీపీ తీర్థం పుచ్చుకుని రాజోలు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు.. ప్రస్తుతం ఆయన రాజోలు నియోజవకవర్గ వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.. ఈ పరిస్థితుల్లో టీడీపీ అధిష్టానం గొల్లపల్లి సూర్యారావుకు షాక్ నిచ్చే ప్రకటన విడుదల చేసింది.. టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతలను గొల్లపల్లి కుమార్తె గొల్లపల్లి అమూల్యకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది.. దీంతో రాజోలు రాజకీయం రసవత్తరంగా మారింది.. 2014 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీచేసిన క్రమంలో గొల్లపల్లి సూర్యారావు కుటుంబం కూడా రాజోలు నియోజకవర్గంలో ఆయనకు సహకారంగా ప్రచారం చేసింది.. ఈక్రమంలోనే గొల్లపల్లి అమూల్య రాజోలు నియోజకవర్గంలో 2014 నుంచి 2024 వరకు రాజోలు టీడీపీ నాయకులతో, కార్యకర్తలతో పరిచయాలు పెంచుకోవడమే కాదు.. ఏకంగా గత అయిదేళ్లుగా నియోజవర్గ పరిధిలోని జగ్గన్నపేటలో నివాసం ఉంటోంది.. ఈక్రమంలోనే 2024 ఎన్నికల్లో టీడీపీ తరపున తాను బరిలో ఉన్నానంటూ టిక్కెట్టు కోసం దరఖాస్తు చేసుకోవడంతో కుటుంబంలో వివాదం మొదలయ్యింది. గొల్లపల్లి సూర్యారావు, ఆయన కుమారుడు శ్రీధర్‌లు అమూల్యను పూర్తిగా పక్కన పెట్టేసినట్లు ప్రచారం జరిగింది.ఒక దశలో రాజోలు టిక్కెట్టు అమూల్యకే ఇస్తున్నారంటూ ప్రచారం కూడా జరిగింది.. అయితే అనూహ్యంగా జనసేన తరపున జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో అత్యంత సన్నిహితంగా ఉండే మాజీ ఐఏఎస్ అధికారి దేవా వరప్రసాదరావు సీన్‌లోకి ఎంట్రీ ఇవ్వడంతో రాజోలు స్థానం జనసేన ఎగరేసుకుపోయింది.. ఈక్రమంలో అయోమయంలో పడిన గొల్లపల్లి సూర్యారావు వైసీపీ ఇచ్చిన ఆఫర్‌ను స్వీకరించి రాజోలు నుంచి వైసీపీ అభ్యర్థిగా బరిలో దిగారు. అయితే ఆయన కుమార్తె గొల్లపల్లి అమూల్య మాత్రం టీడీపీలోనే కొనసాగుతూ చురుగ్గా వ్యవహరించింది.. దీంతో పార్టీ అధిష్టానం దృష్టిలో గుర్తింపు పొంది ఇప్పుడు నియోజకవర్గ ఇంచార్జ్ స్థాయిని అందుకున్నారు.. రాజోలు నియోజకవర్గంలో జనసేన పార్టీ నుంచి ఎమ్మెల్యే దేవవరప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తుండగా వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా గొల్లపల్లి సూర్యారావు ఉన్నారు. మధ్యలో వైసీపీకు పూర్తి ఆపోజిట్ పార్టీగా ఉన్న టీడీపీ నుంచి ఆయన కుమార్తె అమూల్య ఉండడం వైసీపీకు కొరకరాని కొయ్యలా మరిందంటున్నారు..

ఐవీఆర్ ఎస్ ద్వారా నియోజకవర్గంలో అభిప్రాయ సేకరణ చేపట్టిన టీడీపీ అధిష్టానంకు అమూల్య కు మద్దతు తెలుపుతూ 70 శాతంకు పైగా తమ అంగీకారం తెలిపారని తెలుస్తోంది.. పైగా పార్టీ బలోపేతంకు కృషిచేస్తూనే ప్రభుత్వం కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జనసేన ఎమ్మెల్యే వరప్రసాదరావుతో కలిసి పనిచేస్తానని అమూల్య ప్రకటించారు. దీంతో రాజోలు నియోజకవర్గంలో తండ్రీకూతుర్ల మధ్య మాటల యుద్ధం ఏస్థాయిలో ఉంటుందో అంటూ చర్చించుకుంటున్న పరిస్థితి

# బెంగాల్‌లో కొత్త ట్రెండ్..

## ప్రత్యేక వివాహ చట్టం వైపు ముస్లిం జంటలు!

- పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక వివాహ చట్టం కింద ముస్లిం జంటల పెళ్లిళ్లు
- ఓటర్ల జాబితా సవరణపై ఆందోళనే ఇందుకు ప్రధాన కారణం
- బంగ్లాదేశ్, బిహార్ సరిహద్దు జిల్లాల్లో కనిపిస్తున్న ధోరణి
- గత ఏడాదిలో 1,130 దరఖాస్తులు, ఇటీవలి నాలుగు నెలల్లోనే 609
- సంప్రదాయ ఖాజీ సర్టిఫికెట్ కంటే ఎస్ఎంఏ సర్టిఫికెట్‌కే ఎక్కువ గుర్తింపు



కలకత్త: పశ్చిమ బెంగాల్‌లో ఒక కొత్త, అనూహ్య పరిణామం చోటుచేసుకుంటోంది. రాష్ట్రంలోని ముస్లిం జంటలు, ప్రత్యేకించి బంగ్లాదేశ్, బీహార్ సరిహద్దు జిల్లాల్లో, తమ వివాహాలను 'ప్రత్యేక వివాహ చట్టం-1954' (ఎస్ఎంఏ) కింద నమోదు చేసుకునేందుకు పెద్ద సంఖ్యలో ముందుకొస్తున్నారు. సాధారణంగా మతాంతర వివాహాలు చేసుకునేవారులేదా సివిల్ పద్ధతిలో పెళ్లి చేసుకోవాలనుకునేవారు ఈ చట్టాన్ని ఆశ్రయిస్తారు. అయితే, రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలనపై ప్రజల్లో పెరుగుతున్న ఆందోళనలే ఈ మార్పుకు కారణమని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, నవంబర్ 2024 నుంచి అక్టోబర్ 2025 మధ్య కాలంలో 1,130 ముస్లిం జంటలు ప్రత్యేక వివాహ చట్టంలోని సెక్షన్ 16 కింద తమ పెళ్లిళ్ల నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో సగానికి పైగా, అంటే 609 దరఖాస్తులు, కేవలం రావడం గమనార్హం. పొరుగున ఉన్న బిహార్‌లో కూడా ఇదే సమయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ జరగడం, ఇప్పుడు బెంగాల్‌లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ఈ ధోరణి పెరిగింది. ఈ రిజిస్ట్రేషన్లు ఎక్కువగా సరిహద్దు జిల్లాలైన ఉత్తర దినాజ్‌పూర్ (199), మాల్దా (197),ముర్షిదాబాద్ (185), కూచ్‌బెహార్ (97)లలోనే నమోదయ్యాయి. దీనికి విరుద్ధంగా, కోల్‌కతా వంటి పట్టణ ప్రాంతాల్లో కేవలం 24 దరఖాస్తులు రాగా, ఝర్‌గ్రామ్ (1), కాలింపాంగ్ (2) వంటి ప్రాంతాల్లో నామమాత్రంగా ఉన్నాయి. సాధారణంగా బెంగాల్‌లో ముస్లిం వివాహాలు 'బెంగాల్ మహమ్మదీయ వివాహాలు, విడాకుల రిజిస్ట్రేషన్ చట్టం-1876' ప్రకారం ప్రభుత్వంతో నియమితులైన ఖాజీల ద్వారా జరుగుతాయి. ఈ సర్టిఫికెట్లు చట్టబద్ధమైనవే అయినప్పటికీ, వాటి ఫార్మాట్లలో తేడాలు, చిరునామా ధ్రువీకరణలో స్పష్టత లేకపోవడం వంటి సమస్యలున్నాయి.

దీంతో పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు వీటిని బలమైన గుర్తింపు రుజువుగా అంగీకరించడానికి వెనుకాడుతున్నట్లు తెలుస్తోంది. దీనికి భిన్నంగా, ప్రత్యేక వివాహ చట్టం కింద జారీ చేసే సర్టిఫికెట్ దేశవ్యాప్తంగా ఒకే ఫార్మాట్‌లో ఉండి, సర్వత్ర గుర్తింపు పొందింది. దీనిని మరింత అధికారికమైన, నమ్మకమైన పత్రంగా పరిగణిస్తారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా, అధికారులు 2002 నాటి జాబితాతో ప్రస్తుత వివరాలను సరిచూస్తున్నారు. వివరాలు సరిపోలకపోతే, అదనపు గుర్తింపు, నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో, బీహార్‌లో జరిగిన ప్రక్రియ బెంగాల్ సరిహద్దు ప్రజల్లో ఆందోళనను పెంచిందని, అందుకే తమ రాష్ట్రంలో పరిశీలన ప్రారంభం కాకముందే, ముందుజాగ్రత్త చర్యగా బలమైన, ప్రామాణికమైన వివాహ ధ్రువపత్రాన్ని పొందేందుకు వారు ప్రయత్నిస్తున్నారని అధికారులు విశ్లేషిస్తున్నారు.

# సిటీలో వీధికుక్కలపై గ్రేటర్ అధికారుల దృష్టి




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** సుప్రీంకోర్టు తాజా ఆదేశాల మేరకు.. హైదరాబాద్‌లో వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు జీహెచ్ఎంసీ ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలతో నగరంలోని ఆసుపత్రుల పరిసరాల వద్ద ఈ కార్యక్రమం మొదలైంది. తొలి రోజునే 277 కుక్కలను పట్టుకున్నారు. వీటికి స్టెరిలైజేషన్, టీకాలను ఇచ్చి.. జీహెచ్ఎంసీ సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు. ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు వంటి జనాలు ఎక్కుకవగా ఉండే ప్రాంతాల్లో ఈ డ్రైవ్‌ను కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవల కుక్కల దాడులు పెరగడంతో.. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ చర్యలు సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండటం విశేషం. జీహెచ్ఎంసీ కమిషనర్‌ఆర్వీ కర్ణన్ ఆదేశాల మేరకు.. వెటర్నరీ విభాగం సిబ్బంది వీధి కుక్కలను పట్టుకునేందుకు ఒక ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించారు. ఈ డ్రైవ్‌ను ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించి అమలు చేస్తున్నారు.ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రారంభమైన తొలి రోజునే, నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల చుట్టు పక్కల ఏరియాల్లో ఏకంగా 277 వీధి కుక్కలను విజయవంతంగా పట్టుకున్నారు. ఆసుపత్రులలో రోగులు, సందర్శకులు ఎక్కువగా ఉంటారు కాబట్టి.. ఈ ప్రాంతాలకు ముఖ్య ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు మాట్లాడుతూ.. ప్రజల భద్రతను, ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ డ్రైవ్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆసుపత్రుల వద్ద కుక్కలు తిరగడం వల్ల పరిశుభ్రత లోపించడంతో పాటు.. రోగులకు ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నారు.పట్టుకున్న ఈ వీధి కుక్కలను కేవలం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడం కాకుండా.. వాటి సంఖ్యను శాస్త్రీయ పద్ధతిలో నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పట్టుకున్న కుక్కలన్నింటికీ స్టెరిలైజేషన్ లేదా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహిస్తారు. ఈ పద్ధతిని యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం అని కూడా అంటారు. దీనివల్ల వాటి సంఖ్య పెరగకుండా నివారించవచ్చు. శస్త్రచికిత్స పూర్తయిన తర్వాత వాటిని జంతు సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు. తిరిగి.. వాటికి టీకాలు ఇచ్చి, కొద్ది రోజుల పర్యవేక్షణ తర్వాత మాత్రమే పట్టుకున్న ప్రాంతంలోనే సురక్షితంగా విడిచిపెడతారు. కమిషనర్ ఆర్వీ కర్ణన్ నగర ప్రజలకు భరోసా ఇస్తూ.. తొలి దశలో ఆసుపత్రులు, క్రీడా ప్రాంగణాలు, రవాణా కేంద్రాలపై దృష్టి సారించామని తెలిపారు. తదుపరి దశలో పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్‌లు వంటి ముఖ్యమైన పబ్లిక్ ప్రదేశాలు.. అలాగే పార్కులు, మార్కెట్ ప్రాంతాలలో కూడా ఈ డ్రైవ్‌ను కొనసాగిస్తామని ప్రకటించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా.. ఏబీసీ పద్ధతిని పకడ్బందీగా అమలు చేస్తూ.. హైదరాబాద్‌ను కుక్కల బెడద లేని నగరంగా మార్చేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# ఆగని రజనీ రచ్చ!



**గుంటూరు,తెలంగాణ దిశ :**పల్నాడు జిల్లాలో మాజీ మంత్రి విడదల రజిని పోలీసులపై కీలక వ్యాఖ్యలు చేశారు. తనను, తన అనుచరులను లక్ష్యంగా చేసుకొని పోలీసులు వ్యవహరిస్తున్న తీరు పూర్తిగా అన్యాయమని, ఇది చట్ట వ్యవస్థను అవమానించే పని అని ఆమె మండిపడ్డారు. చట్టానికి, వ్యవస్థలకు తమకు సంపూర్ణ గౌరవం ఉన్నప్పటికీ, పోలీసుల ప్రవర్తన మాత్రం రౌడీలు, గూండాలను తలపిస్తోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడుతున్న రజిని:. వైసీపీ మాజీ మంత్రి విడదల రజిని తనపై, తన అనుచరులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడుతున్నారు. తనపై నమోదవుతున్న కేసుల నేపథ్యాన్ని వివరించిన రజిని, శ్రీ గణేష్ చౌదరి పేరుతో జరుగుతున్న ఫిర్యాదులు పూర్తిగా రాజకీయ నాటకమని అన్నారు. గణేష్ చౌదరి గత ఎన్నికల్లో దర్శి టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ప్రచారంలో పాల్గొన్నాడని, ఈ విషయాన్ని ఫిర్యాదు చేసినవాళ్లే ముందే పేర్కొన్నారని ఆమె చెప్పారు. ఈ ఏడాది మార్చిలో దర్శిలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో కూడా గణేష్ టీడీపీ అనుచరుడని స్పష్టమైన పత్రాలలో ఉందని రజిని వెల్లడించారు. పదేళ్ల క్రితం తీసుకున్నట్లు చెప్పిన 35 లక్షల రూపాయల వ్యవహారాన్ని ఇప్పుడు తనపై తప్పుడు కేసులుగా మలచడానికి ప్రయత్నించడం ఎంతో విచారకరమని ఆమె అన్నారు. మాబు సుభాని టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడని ఆరోపణ:. మాబు సుభాని అనే వ్యక్తి పల్నాడు ఎస్పీ కార్యాలయంలో తమపై ఫిర్యాదు చేసిన విషయాన్ని ప్రస్తావించిన ఆమె, అతను టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడని, అంతకుముందు చిలకలూరిపేట టౌన్ స్టేషన్‌లో గణేష్‌తో రాజీకి వచ్చిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ అంశాలను పట్టించుకోకుండా, ఒకవైపు ఫిర్యాదు పెట్టేలా, మరోవైపు కేసులు నమోదు చేసేలా పోలీసులు పనిచేస్తున్నారని రాజినిలు విమర్శించారు. పల్నాడు జిల్లాలో ఒక ఉన్నతాధికారి ఓ ప్రత్యేక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితులు వస్తున్నాయంటూ ఆమె ఆరోపించారు. తప్పుడు ఫిర్యాదులు చేస్తే వెంటనే కేసులు పెట్టడం, యూనిఫామ్ వేసుకున్న పోలీసులు మూడు పార్టీలకీ అనుకూలంగా పని చేయడం వంటి వ్యవహారాలు చట్టపరమైన విధ్వంసానికే నిదర్శనమని ఆమె అన్నారు. ఎస్పీకి ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి రజిని:. తన వ్యక్తిత్వ హననానికి డీఎస్పీ నేరుగా పాల్పడ్డారని, దీనిపై పరువు నష్టం దావా వేయడమే కాక హ్యూమన్ రైట్స్ కమిషన్, మహిళా కమిషన్‌లను ఆశ్రయిస్తానని రజిని ప్రకటించారు. రాజకీయంగా ఒక మహిళ ఎదగడం కొందరికి నచ్చడం లేదని, అందుకే తమ మీద తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపిం చారు.. టీడీపీ వాళ్లే ఫిర్యాదు చేసి, వాళ్ల ప్రభుత్వమే కేసులు పెట్టేలా చూస్తోందని ఆమె మండిపడ్డారు. తనపై ఎస్సీ, ఎస్టీతో సహా ఏడు కేసులు నమోదు చేసినా, వాటిని ఎదుర్కొనే ధైర్యం, న్యాయం తనవైపునే ఉందని ఆమె తెలిపారు. ఈ ఘటనలపై నిష్పక్షపాత విచారణ జరగాలని ఇప్పటికే ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు రజిని వెల్లడించారు.

# నిధులు విదల్చని కేంద్రం

- ఇవ్వాల్సింది రూ.32,284 కోట్లు.. ఇచ్చింది రూ.4,014 కోట్లే
- కూటమిలో ఉన్నా రాష్ట్రానికి మొరడిచేయే
- అర్ధ వార్షిక లెక్కలతో ఆందోళన




**అమరావతి,తెలంగాణ దిశ :**ఎస్ఎ కూటమిలో భాగంగా ఉన్నప్పటికీ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రం పట్ల చిన్నచూపు చూస్తూనే ఉంది. రాష్ట్రంలో డబుల్ ఇంకిస్ సర్కారు ఉందని చెబుతున్న మాటలకు ఆచరణకు సొంతన కనవడటం లేదు. కేంద్రం నుంచీ రాష్ట్రానికి రాణా ల్సిన గ్రాంట్లలో భారీ ఎత్తున కోత పడటమే దీనికి తాజా నిదర్శనం. ఈ సంవత్సరవు వార్షిక బడ్జెట్ ప్రతిపాదనల్లో 32,284 కోట్ల రూపాయిలు గ్రాంట్లుగా కేంద్రం నుండి వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం చూపించింది. దాదాపు బర్ధ సంవత్సర కాలం ముగుస్తుం దగా ఇప్పటి వర కు వచ్చింది కేవలం నాలుగు వేల కోట్ల రూపాయలు మాత్రమే కావడం గమనార్హం. అంచనా వేసిన మొత్తంలో నాల్గవ వంతు కూడా లేకపోవడం అధికార యంత్రాంగంలో చర్చనీయాం శంగా మారింది. ప్రధానంగా కేంద్రం ఇచ్చే గ్రాంట్లు కేంద్రం పన్నుల్లో వాటా నిధులే రాష్ట్రానికి కీలకంగా ఉంటాయి. ఈ నిధుల ఆధారంగానే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నా రు. అయితే, ఆ నిధుల్లోనే భారీగా కోత పడుతుండటం అధికారులన ఆందోళనకు గురిచేస్తోంది. వారు చెబుతున్న లెక్కల ప్రకారం రావాల్సిన మొత్తంలో కేవలం 12 శాతం మాత్రమే ఇప్పటి వరకు కేంద్ర నిధులు రాష్ట్రానికి అందాయి. అరునెలల కాలానికి 50 శాతం నిధులు రావాల్సిఉ ందగా, 25 శాతం కూడా రాకపోవడం గమనార్హం. కే ంద్ర పనల్లో రాష్ట్ర వాటా కూడా ఇప్పటివరకు 42 శాతమే చేతికందింది. ఏడాది మొత్తానికి రూ.10,807 కోట్లు రావాల్సి ఉండగా, ఆర నెలల్లో రూ.17,187 కోట్లు మాత్రమే రావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రం కీలకంగా ఉన్నప్పటికీ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు పట్టించుకోవడం లేదని, కేంద్రంపై వత్తిడి తేలేకపోతున్నారని విమర్శలు ఉన్నాయి. దీనిని అలుసుగా తీసుకుంటున్న కేంద్రం క నాదా నిధుల ఎగవేతకు పాల్పడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మిగిలిన ఆదాయాన్ని చూసినా అన్ని రంగాల్లోనూ లక్ష్యాని కన్నా తక్కువగా నిధులు సమకూరాయి. పన్నేతర ఆదాయం కేవలం 13 శాతంగానే నమోదైంది.

ఆదాయ లోటు 140 శాతానికి చేరుకోవడం ఆందోళన కలిగిస్తోందని అధికారులు అంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నులు గ్రాంట్లు ద్వారా రూ.2.17 లక్షల కోట్లు వస్తాయ ని అంచనా వేయగా, 74 వేల కోట్లు మాత్రమే వచ్చాయి. అంచనా మేరకు కేంద్రం నుండి నిధులు కారపోవరంలో రూ.63 వేల కోట్లు రుణం తీసుకోవాల్సివచ్చింది. ఫలితంగా ఐడ్జెట్లో రూ.79,926 కోట్లు రుణం తీసుకోవాలని ప్రతిపాదించగా, ఆరు నెలల్లోనే 78 శాతానిడి పైగా రుణం సేకరించాల్సి వచ్చింది. దీంతో మిగిలిన ఆరు నెలలకు తీసుకునేందుకు అవకాశం ఉన్న రుణం కేవలం రూ.17 వేల కో ట్ల వరకు మాత్రమే ఉన్నట్లు తేలింది. భారీగా ఆదాయ లోటు:

ఆదాయం కన్నా వ్యయం ఎక్కువగా ఉండడంతో లోటు కూడా అదే స్థాయిలోకి చేరుకుంటోంది. ఈ ఏడాది ఆదాయ లోటు రూ.33,185 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేయగా, తొలి ఆరు నెలలకే రూ.46,652 కోట్లకు లోటు చేరుకోవడం గమనార్హం. ద్రవ్య లోటు రూ దా రూ.79,926 కోట్లు ఉంటుందని అంచనా వేయగా,ఇప్పటికే రూ.62 వేల కోట్లు వరకు పెరిగిపోయింది.

# ఛాంబర్ ఎన్నికల కోసం కసరత్తులు..!

**ఖమ్మం,తెలంగాణ దిశ :**'ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఖమ్మం పట్టణ వ్యాపార వర్గాలకు సంబంధించిన ఓ సంఘం. దీని పరిధిలో 18 వ్యాపార వర్గాలు, వీటికి సంబంధించిన సభ్యులు 1305. మూడేళ్లకు ఓ సారి ఈ సంఘానికి ఎన్నికలు జరుగుతాయి. ఈ లెక్కన వీటికి సంబంధించిన ఎన్నికల తంతు నామమాత్రమే అనుకోవాలి. కానీ, దీనికోసం పోటీ పడబోయే ఆయా వర్గాల హడావిడి మినీ సార్వత్రిక ఎన్నికలను తలపిస్తున్నాయి.గెలుపు కోసం ఆయా వర్గాలు పోటీ పడుతూ, తీవ్రస్థాయిలో ప్రచారం చేస్తున్నాయి. అయితే ఇందులో ఓ వర్గం మాత్రం గెలుపే ధ్యేయం గా వింత పోకడలు పోతోంది. ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు 'మందు, విందు' అంటూ అడ్డదారులు తొక్కుతోంది. ఇందుకోసం చీకటి పడగానే ప్రత్యేక ఏర్పాట్లు చేసి భారీగానే ఖర్చు పెడుతోంది. సదరు వర్గం వ్యవహా రాన్ని చూస్తున్న కొంతమంది విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 'చిన్న పాటి పదవుల కోసం ఈ స్థాయిలో దిగజారాలా?' అనే విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లకు ఓసారి జరిగే ఎన్నికల్లో ప్రధాన పానెల్ కు సంబంధించిన ఎన్నికే ముఖ్యమైనది. ఆ తరువాత దిగు మతి శాఖ కు ప్రాముఖ్యం ఉంటుంది. మిగతా శాఖలకు సంబంధిం చిన ఎన్నిక నామ మాత్రమే! ప్రధాన పానెల్ కు ఎన్నికల కోసం రెండు వర్గాలు ప్రధానంగా పోటీ పడుతున్నాయి. ఈ ప్యానెల్ లోనే అధ్యక్ష, ఉపాధ్యక్ష, సెక్రటరీ, ట్రెజరర్ల పదవులు ఉండటం, వీటికి ఎన్నికైన వారి చేతిలోనే ఛాంబర్ అధికారాలు ఉండటమే కాకుండా ఆయా శాఖల్లో, ముఖ్యంగా గ్రెయిన్ మార్కెట్లో పలుకుబడి ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో ప్రధాన పానెల్ ను ఎలాగైనా దక్కించుకోవాలని ఈ రెండు వర్గాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. సంఘం ఓటర్లను కలిసి తమకే ఓటు వేయాలని వేడుకోవడంతోపా టు, ప్రచార చిత్రాలను, బ్యానర్లను ప్రధాన మార్కెట్ కూడళ్లలో ఏర్పాటు చేసి గెలుపు కోసం ఆరాటపడుతున్నాయి. వీరి ప్రచారంతో త్రీ టౌన్ లోని గాంధీ చౌక్, గ్రెయిన్ మార్కెట్ ప్రాంతమంతా హడావుడిగా కనిపిస్తోంది. ప్రధాన పానెల్ కు పోటీ పడుతున్న ఓ వర్గం ఛాంబర్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని కసితో అడ్డదారుల్లో వెళ్లేందుకు ప్రయత్నిస్తోం దని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. నామినేషన్ వేసిన రెండో రోజు నుంచే ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు ఎత్తులు వేసింది. మందు పార్టీలు ఏర్పాటు చేసి విందులు చేసింది. ఈ విష యం బయటకు పొక్కడంతో తమ ప్యానెల్ కు చెడ్డ పేరు వస్తోందని, దీనివల్ల తమ ఓటు బ్యాంకు కి చిల్లు పడే అవకాశం ఉందని భావించి వేరే మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. నేరుగా ముందు పార్టీ అని కాకుండా జన్మదిన వేడుకల ముసుగులో మద్యం పార్టీలు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.ఇందుకోసం ఛాంబర్ ఓటర్లలో ఎవరిదైనా పుట్టినరోజు ఉందేమోనని ఆరా తీసి, వారి పేరిట సాయంత్రం మందు పార్టీకి సదరు వర్గం సన్నాహాలు చేస్తోంది. ఆ రోజు జన్మదినం జరుపుకునే వారిని తాము నిర్ణయిం చిన చోటుకి సాయంత్రం పిలిపించి, వారితో కేకు కోయించి సంబరాలు చేస్తున్నారు. ఆ తర్వాత సంబరాలకు వచ్చిన వారిని మందు, విందుల్లో ముంచి తేల్చుతున్నా రు. ఈ మందు పార్టీకి ఓటర్లలో ఎవరిని ఆహ్వానించాలో ఉదయమే నిర్ణయించి, వారికి రహ స్యంగా సమాచారం అందించడమే కాకుండా, వారంతా తామిచ్చే పార్టీకి కచ్చితంగా హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకు ప్రతిరోజు రూ. 70 వేల నుంచి రూ. లక్ష వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచా రం. దీనికి సంబంధించిన ఖర్చును సదరు వర్గం తరఫున పోటీపడే వారు వాటాలు వేసుకొని భరిస్తున్నట్లు తెలుస్తోంది. ఛాంబర్ ఎన్నికలకు పోటీ పడుతున్న వారంతా వ్యాపారులే! వీరంతా తమ పెట్టుబడి మీద 10% నష్టాన్ని కూడా భరిం చడానికి ఒప్పుకోరు. లాభం లేనిదే రూపాయి కూడా ఖర్చు చేయరు. ఖర్చు దాదాపు రూ.20 నుంచి రూ.25 లక్షల మేర వస్తుందని అంచనా! కేవలం ఛాంబర్ పదవుల కోసం ఈ స్థాయిలో ఖర్చు చేస్తుండటంపై పలు సం దేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల్లో గెలి చి పదవులు దక్కితే, ఆ తర్వాత ఛాంబర్ కు వచ్చే ఆదాయం నుంచి తాము పెట్టిన ఖ ర్చును ఎలాగో ఒకలాగా రాబట్టుకోవచ్చనే భావనలో సదరు వర్గం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఛాంబర్ ను తన గుప్పెట్లో పెట్టుకొని తమ వ్యాపారాలను ఇష్టరీతిన నిర్వహించుకునేందుకే ఈ వ్యవహారమంతా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు వర్గం చేస్తున్న హడావుడి చూస్తుంటే ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ప్యానెల్ నుంచి ప్రధాన పదవులకు పోటీ పడబోతున్న వారి పైన మొదటి నుంచి విమర్శలు ఉన్నాయి. ఈ ప్యానెల్ లోని ఓ వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అక్రమాలకు పాల్పడ్డాడు అనే విమర్శలు ఉన్నాయి. ఇక దీనికి తోడు ఇతరత్రా వర్గాల్లో కాస్త మేనేజ్ చేయగలిగిన వ్యక్తులను చేరదీసి, తన వెంచర్లలో చీకటి వ్యవహారాలు చేయిస్తాడనే ప్రచారం ఉంది. సదరు వ్యక్తి గురించి తెలిసిన కొంతమంది వ్యాపారులు ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తుండడం గమనార్హం! ఇక పానెల్ మరో ప్రధాన సీటుకి పోటీ పడబోతున్న ఓ పెద్ద ఖరీదుదారు కమీషన్ వ్యాపారులను పీల్చి పిప్పి చేస్తాడనే ప్రచారం ఉంది. కటింగ్ బిల్లుల వ్యవహారంలో ఊరంతా ఓ పోకడైతే, సదరు వ్యాపారిది మరో దారి. సదరు పెద్ద వ్యాపారి కటింగ్ బిల్లు రేటుని తగ్గిస్తే, మిగతా వ్యాపారులు కూడా తగ్గిస్తారు. దీని వల్ల కమీషన్ వ్యాపారులకు కాస్త ఊరట కలుగుతుంది. విడుపు ప్రదర్శించడని సమాచారం. ఇలా అక్రమ వ్యవహారాల్లో పాలు పంచుకునే వ్యక్తి, వ్యాపారుల గురించి కనీసం ప ట్టించుకోని వ్యక్తులు ఛాంబర్ పదవులకు ఎ లా పోటీ చేస్తారని, ఒకవేళ గెలిచినా వ్యాపార వర్గాలకు ఎలా న్యాయం చేస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# రాజధానికి మీరు సలహాలు ఇవ్వొచ్చు..



**విజయవాడ,తెలంగాణ దిశ :**ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మించాలని కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వం హయాంలో అమరావతిలో ఆగిపోయిన పనులను పునరుద్ధరిస్తోంది. మరోవైపు, పూర్తిస్థాయి రాజధాని నిర్మాణం కోసం అవసరమయ్యే నిధుల సేకరణకు ప్రయత్నాలు చేస్తోంది. వివిధ ఆర్థిక సంస్థల నుంచి రూ. 32,500 కోట్ల నిధులు సేకరించేందుకు సిద్ధం అయింది. ఈ నేపథ్యంలో కేవలం అమరావతి మాత్రమే కాకుండా.. ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ ప్రణాళికలను రూపొందించడంలో ప్రజలను కూడా భాగస్వాములు కావాలని తాజాగా ప్రభుత్వం పిలుపునిచ్చింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత 'విజన్ 2047' డాక్యుమెంట్‌ను రూపొందించడంలో మాతో చేరండి అని ప్రజలను ఆహ్వానించింది.'విజన్ 2047' డాక్యుమెంట్‌ను రూపొందించడంపై ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్డీఏ) ఓ ప్రకటన చేసింది. అందులో.. ఏపీసీఆర్డీఏ ప్రపంచ స్థాయి రాజధాని ప్రాంతాన్ని నిర్మించేందుకు 'విజన్ 2047'ను రూపొందిస్తోందని తెలిపింది. విజన్ కార్యచరణలో భాగంగా, ప్రజలు, వివిధ భాగస్వాముల నుండి రాజధాని ప్రాంతీయ అభివృద్ధి సంస్థ పరిధి కోసం ఆలోచనలు, సూచనలు, ప్రాధాన్యతలు, అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపింది. సీఆర్డీఏ ప్రాంతం సుమారు 8600 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉందని తెలిపింది. ఇది దేశంలోనే అతిపెద్ద ప్రణాళికా ప్రాంతాలలో ఒకటని వెల్లడించింది. ఈ రాజధాని ప్రాంతంలో.. కృష్ణా, ఎన్‌టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాల్లోని 56 మండలాలను ఉన్నాయని వివరించింది. విజయవాడ, గుంటూరు, అమరావతి, మంగళగిరి? తాడేపల్లి లాంటి నగరాలతో పాటు 900కు పైగా గ్రామాలు రాజధాని పరిధిలో ఉన్నాయని పేర్కొంది.ఈ క్రమంలో ప్రజలు వెల్లడించే అభిప్రాయాలు.. ఏపీసీఆర్డీఏ బృహత్ప్రణాళిక (మాస్టర్ ప్లాన్ ), విజన్‌కు తోడ్పడతాయని సీఆర్డీఏ ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు ఒక గూగుల్ ఫామ్ తయారు చేసింది. ఈ ఫామ్ నింపి సీఆర్డీఏ ప్రాంతం అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రజలను కోరింది. కాగా, ఈ సర్వేలో భాగస్వాములు కావాలనుకునే వారు సీఆర్డీఏ వెబ్‌సైట్ (ఇ‌తీటజీ.జీజూ.ఇనీల.తిని)లోకి వెళ్లి లింక్‌పై క్లిక్ చేయడం లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అభిప్రాయాలు తెలియజేయవచ్చు. గూగుల్ ఫామ్ ఇంగ్లీష్, తెలుగు భాషల్లో అందుబాటులో ఉంది. ఇక్కడ అడిగిన ప్రశ్నలకు టిక్ మార్క్ పెట్టి ప్రజలు తమ అభిప్రాయాలు తెలపవచ్చు. అయితే ఆంధ్రప్రదేశ్ వాసులు మాత్రమే కాకుండా.. విదేశాల్లో ఉన్నవారు.. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా, ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధిపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేయొచ్చు.

2028 నాటికి చట్టబద్ధత: రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల కార్యాలయాల నిర్మాణం జరుగుతోంది. బ్యాంకింగ్ రంగ సంస్థల కార్యాలయాల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన జరగనుంది. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ జరుగుతోంది.

అయితే గత అనుభవాల దృష్ట్యా అమరావతిని చట్టబద్ధత చేయాల్సిన అవసరం ఉంది. సిఆర్డిఏ చెబుతున్నట్టు ఐదు జిల్లాల పరిధిలో దాదాపు తొమ్మిది వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్న అమరావతికి పార్లమెంట్ ఆమోదముద్ర తక్షణ అవసరం. గత అనుభవాల దృష్ట్యా ఇది కీలకం కూడా. చట్టబద్ధత కల్పిస్తే.. అమరావతి అనే దానిని కదిలించలేరు కూడా. అయితే 2029 ఎన్నికల నాటికి అమరావతిని ఒక రూపానికి తెచ్చి ప్రజలకు ఓటు అడగాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అంటే కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేసి చట్టబద్ధత కల్పిస్తుందన్నమాట.

అమరావతి రాజధాని లో నవ నగరాలు నిర్మించాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అయితే గ్రేటర్ హైదరాబాద్ మాదిరిగా అమరావతిని నిర్మించి ప్రపంచంలోనే గుర్తింపు తీసుకురావాలన్నది ఆరాటంగా తెలుస్తోంది. అయితే 2014లో అందరి ఆమోదముద్రతో అమరావతి రాజధానిని ఎంపిక చేశారు చంద్రబాబు. పనులు కూడా ప్రారంభించారు. కానీ 2019లో అధికారం మారిపోయేసరికి మూడు రాజధానులు అంశం తెరపైకి వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతి రాజధాని నిర్మాణాన్ని నిర్వీర్యం చేసింది. దాని పర్యవసానాలు అందరికీ తెలిసిన విషయమే. భూములు ఇచ్చిన రైతులు రోడ్డెక్కారు. వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. అయితే వారి ప్రార్థనలు ఫలించి టిడిపి కూటమి వచ్చింది. లేకుంటే వారి పరిస్థితి ఎలా ఉంటుందో కూడా ఊహించలేం. వైసీపీ అధికారంలోకి వచ్చి ఉంటే అమరావతి అనేది పూర్తిగా నిర్వీర్యం అయిపోయేది. గత అనుభవాల దృష్ట్యా అమరావతి రాజధాని నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉంది కూటమి ప్రభుత్వం. అదే సమయంలో అమరావతిని కదిలించలేని స్థితిలోకి చేర్చాలని ఒక పట్టుదలతో ఉంది. అయితే అది 2028 లోనే చేయాలన్న తలంపుతో ఉంది. ఎందుకంటే ఆ సమయానికి అ మరావతి రాజధాని నిర్మాణం ఒక కొలిక్కి వస్తుంది. అమరావతికి ఒక రూపు తెచ్చి.. పార్లమెంటులో బిల్లు పెట్టాలని చూస్తోంది టిడిపి కూటమి ప్రభుత్వం. అలా ఆ బిల్లును ఆమోదించి.. అమరావతిని శక్తివంతమైన నగరంగా మార్చాలన్నది చంద్రబాబు ప్రణాళిక. తద్వారా ప్రజలకు గట్టి సంకేతాలు పంపించనున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా డ్యామేజ్ చేయనున్నారు. అసలు అమరావతి విషయంలో స్టాండ్ ఏంటి అని వైసిపి చెప్పుకోలేని స్థితికి తేనున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


ఏకపక్ష మద్దతు.. పార్లమెంటులో అమరావతి బిల్లు ప్రవేశ పెడితే ఏకపక్షంగా ఆమోద ముద్ర వేసే అవకాశం ఉంది. ఎందుకంటే అమరావతి రాజధానికి అన్ని పార్టీల మద్దతు ఉంది. ఒక్క వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్ప. అయితే ఆ పార్టీ జాతీయస్థాయిలో ఏ కూటమితో కూడా లేదు. తెలుగుదేశం, జనసేన ఎన్డీఏ కూటమిలో ఉంది. ఇండియా కూటమికి కాంగ్రెస్ నాయకత్వం వహిస్తోంది. వామపక్షాలు సైతం అదే కూటమిలో ఉన్నాయి. కాంగ్రెస్ తో పాటు వామపక్షాలు సైతం అమరావతి రాజధానికి జై కొట్టాయి.

దీంతో బిల్లు ప్రవేశపెట్టడమే తరువాయి చాలా సులువుగా ఆమోదముద్ర వస్తుంది. చంద్రబాబులో కూడా అదే ధీమా. ఇప్పుడు గాని చట్టబద్ధత కల్పిస్తే రాజకీయంగా ఎటువంటి ప్రయోజనం ఉండదు. 2028 నాటికి అమరావతికి ఒక తుది రూపు తెచ్చి.. పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలన్న ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## పాస్‌వర్డులతో జాగ్రత్త..

## సులభంగా ఉంటే సైబర్ క్రిమినల్స్‌కు చిక్కినట్టే!

### 2025లో వాడిన వాటిలో సులువైనవే ఎక్కువ





న్యూఢిల్లీ: ఆన్‌లైన్ అకౌంట్ పాస్‌వర్డు చాలా క్లిష్టంగా ఎవరూ ఊహించని విధంగా ఉండాలని సైబర్ క్రైమ్ విభాగాలు హెచ్చరిస్తుంటాయి. అయితే ఓ తాజా అధ్యయనం ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2025లో ప్రజలు అత్యధికంగా 123456, అడ్మిన్, పాస్‌వర్డ్, ఇండియాఏ123 వంటి పాస్‌వర్డులను ఉపయోగించారు. దాదాపు 200 కోట్ల ఖాతాలకు చెందిన పాస్‌వర్డులు సులభంగా హ్యాకింగ్‌కు గురయ్యే రీతిలో ఉన్నట్లు కంపేరిటెక్ పరిశోధకులు వెల్లడించారు. సర్వసాధారణంగా అత్యధికులు ఉపయోగించే పాస్‌వర్డులలో అడ్మిన్, ఎఏ123456, 123, 12345 67890, పాస్‌వర్డు ఉన్నాయి. 123 456 పాస్‌వర్డును 76 లక్షల మందికిపైగా ప్రజలు ఉపయోగిస్తున్నారు. కాగా, అడ్మిన్ అనే పాస్‌వర్డును 19 లక్షల మందికిపైగా వినియోగిస్తున్నారు. అత్య ంత సర్వసాధారణమైన 100 పాస్‌వర్డుల జాబితాలో ఇండియాఏ123కి 53వ స్థానం దక్కింది.

అత్యధికంగా వాడిన పాస్‌వర్డులివే: ప్రపంచవ్యాప్తంగా ప్రజలు అత్యధికంగా ఉపయోగిస్తున్న పాస్‌వర్డులలో 123456, 12345678, అడ్మిన్, 1234, ఎఏ123456, 12345, పాస్‌వర్డు, 123, 1234567890 ఉన్నాయి.

ఎలాంటి పాస్‌వర్డ్ ఉండాలి?: ఆన్‌లైన్ అకౌంట్ సురక్షితంగా ఉండాలంటే పలు జాగ్రత్తలు తీసుకోవాలని మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు సూచిస్తున్నాయి. పాస్‌వర్డుకు కచ్చితంగా 12 అక్షరాలు ఉండాలి. ఇందులోని అక్షరాలు క్యాపిటల్, స్మాల్ లెటర్స్ కలగలిపి ఉండాలి. మధ్యలో సంఖ్యలు, చిహ్నాలు కూడా ఉండాలి. కుటుంబ సభ్యుడి పేరు, సొంత కంపెనీ వస్తువు, పోషించిన పాత్రల పేర్లు వంటివి పాస్‌వర్డులో ఉండకూడదు. ఫ్రాన్స్‌లోని లూవ్రా మ్యూజియంలో చోరీ కూడా సులువైన పాస్‌వర్డ్ కారణంగానే జరిగింది.

## ఇక ఏఐ సాయంతో తిరుమల దర్శనం




**తిరుమల,తెలంగాణ దిశ :** తిరుమల శ్రీవారి దర్శనం కోసం కొండకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే సాంకేతికత సాయంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే ఆలోచనలు చేస్తోంది. అందులో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో శ్రీవారి భక్తులకు రెండు గంటల్లోగా దర్శనం కల్పించే ఆలోచనను టీటీడీ గతంలో చేసింది. అయితే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావటం తో పాటుగా కొంతమంది నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. ఏఐ సాయంతో రెండు గంటల్లో శ్రీవారి దర్శనం గురించి విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియపై కాస్త వెనుకడుగు వేసిన టీటీడీ .. మరోసారి ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించే ఆలోచన చేస్తోంది. ఈ విషయాన్ని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. ఈ క్రమంలోనే ఏఐ సాయంతో తిరుమల శ్రీవారి దర్శనం గురించి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ ద్వారా రెండు గంటల్లో శ్రీవారి దర్శనం కల్పించాలనే ఆలోచన గతంలో చేసినట్లు బీఆర్ నాయుడు వివరించారు. అయితే ఓ వర్గం నుంచి వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. టీటీడీ నూతన ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో త్వరలోనే ఈ ఏఐ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కి స్తామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. తాము బాధ్యతలు చేపట్టిన తర్వాత తిరుమల అన్నప్రసాదాల్లో మార్పులు వచ్చాయని బీఆర్ నాయుడు చెప్పుకొచ్చారు. భక్తులకు రుచికరమైన భోజనం అందిస్తున్నామని.. లడ్డూ ప్రసాదంలోనూ చాలా మార్పులు చేశామన్నారు. ప్రస్తుతం లడ్డూ ప్రసాదాలు 10 రోజులైనా నిల్వ ఉంటున్నాయని భక్తుల నుంచ్ స్పందన వస్తోందన్నారు. తిరుపతివా సులు మూడు వేల మందికి ప్రతి నెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శన భాగ్యం కల్పిస్తున్నామని వివరించారు. తిరుమల కాటేజీలకు దేవుడి పేర్లు పెట్టాలని నిర్ణయించామని.. టీటీడీలోని అన్యమతస్తులను కూడా కొంతమందిని ఉద్యోగాల నుంచి తొలగించా మన్నారు. తిరుమల శ్రీవారి బ్రేక్ దర్శనాల విషయంలోనూ మార్పులు చేశామని బీఆర్ నాయుడు వివరించారు. ఉదయం పదిన్నరకు ఉండే బ్రేక్ దర్శనాలను తెల్లవారు జాముకు మార్చామన్నారు. శ్రీవాణ ట్రస్టు కింద 5 వేల ఆలయాల నిర్మాణం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో గుడులు, భజన మందిరాలు నిర్మించనున్న ట్లు తెలిపారు.మరోవైపు తిరుమల తరహాలో టీటీడీ ఆధ్వర్యంలోని ఆలయాల్లో నిత్యాన్నదానం అమలు చేయనున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరించారు. తిరుపతి తిరుమల మధ్యన ఎలక్ట్రికల్ బస్సులు నడుపుతామని టీటీడీ ఛైర్మన్ చెప్పుకొచ్చారు. కేంద్ర మంత్రి కుమారస్వామి టీటీడీకి 100 ఎలక్ట్రిక్ బస్సులు ఇస్తామన్నారని.. వాటిని తిరుపతి, తిరుమల మధ్య నడపనున్నట్లు తెలిపారు. దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి ఆలయం నిర్మిస్తామన్న టీటీడీ ఛైర్మన్.. కరీంనగర్‌లో రూ.30 కోట్లతో , దుబ్బాకలో రూ.4.5 కోట్లతో శ్రీవారి ఆలయాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు.

## నానికే కాపుకాస్తారా..!




**విజయవాడ,తెలంగాణ దిశ :**మాజీ మంత్రి పేర్ని నానికి క్రేజ్ ఉంది. మచిలీపట్నం లో ఆయనకు కాపు సామాజికవర్గం కూడా అండగా ఉండేది. ఎక్కువ మంది కాపులు ఆయనకు మద్దతిచ్చేవారు. కానీ 2019 ఎన్నికల తర్వాత పేర్ని నాని పై కాపుల్లో వ్యతిరేకత మొదలయింది. పేర్ని నాని ఒంటికాలిపై పవన్ కల్యాణ్ పై లేస్తుండటం, ఆయనపై విమర్శ లు చేస్తుండటంతో సొంత సామాజికవర్గం నానికి దూరమయిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. పేర్ని నాని మంచి వాగ్ధాటి ఉన్న నేత. నాడు జగన్ కేబినెట్ లో మంత్రిగా ఉండి పవన్ కల్యాణ్ ను టార్గెట్ చేయడం వల్లనే కాపు సామాజికవర్గం నానికి దూరమయింద న్నది వాస్తవం. అంతకు ముందు ఆయనకు బలంగా నిలిచిన వర్గం కూడా ఆయన వైపు నిల్చోకపోవడానికి జనసేన కారణమని చెప్పాలి.. కొన్ని పరిణామాలు పేర్ని నానికి అనుకూలంగా మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. పవన్ కల్యాణ్ గత పదహారు నెలల నుంచి కొంత మౌనంగా ఉండటంతో పాటు కందుకూరు ఘటనపై మాట్లాడక పోవడంతో పాటు గతంలో మచిలీపట్నంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం, నామినేటెడ్ పదవుల్లో తమకు అన్యాయం జరిగిందని భావించడం, మచిలీపట్నంలో ప్రస్తుతం కాంట్రాక్టులు, నామినేటెడ్ పదవులు కొందరికే దక్కుతుండటంతో నానికి అనుకూలంగా క్రమంగా కాపులు కూడా మారుతున్నారన్నది వాస్తవం. ఇది ఎవరు అవునన్నా కాదన్నా నిజం. అక్కడి పరిస్థితుల్లో మార్పులు కనిపిస్తున్నాయి స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే ఖచ్చితంగా ఫలితాలు నాని వైపు ఉంటాయన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికతోనూ ఫలితాలు ఉంటాయని అంటున్నారు. మచిలీపట్నం జనసేనలో మాత్రం కూటమి సర్కార్ పై కొంత అసహనం ఏర్పడింది. అందులోనూ టీడీపీపై కొంత వ్యతిరేకతతో ఉన్నారు. పవన్ కల్యాణ్ కూడా పార్టీ కోసం కష్టపడిన తమను పట్టించుకోవడం లేదన్న అభిప్రాయంలో ఉన్నారు. అయితే దీనిని పేర్ని నాని రాజకీయంగా ఉపయోగించుకునే అవకాశముంది. మంత్రి కొల్లు రవీంద్ర కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణంపై రోడ్డు విస్తరణ పనులు కూడా నాని బయటకు తెచ్చి తన వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరి పేర్ని నాని ప్రయత్నాలు ఎంత వరకూ ఫలిస్తాయన్నది చూడాలి.

## బెంగళూరు జైల్లో ఖైదీలకు సర్వభోగాలు!

బెంగళూరు: బెంగళూరు జైలులో సకలభోగాలు అనుభవిస్తున్న ఖైదీలకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. పలు తీవ్రమైన కేసుల్లో శిక్షలు పడిన ఖైదీలు, రేపిస్టులు, నేరస్తులు జైలులో తెగ ఎంజాయ్ చేయడం ఈ వీడియోలో కనిపిస్తుంది. కొందరు దర్జాగా మొబైల్ ఫోన్లలో మాట్లాడుతుంటే.. మరికొందరు ఎంచక్కా టీవీలు చూస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ఈ జైలులోని ఖైదీలు శిక్ష అనుభవిస్తున్న తీరు చూసి ప్రతి ఒక్కరూ నోరెళ్లబెడుతున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులోని ఖైదీల లగ్జరీ లైఫ్‌కు సంబంధించిన దృశ్యాలు ఇవి.ఈ వీడియోలో కనిపించిన ఖైదీల్లో 1996 నుంచి 2022 మధ్య 20 మంది మహిళలపై అత్యాచారం చేయడంతోపాటు వారిలో 18 మందిని హత్య చేసిన కేసులో దోషిగా తేలిన ఉమేష్ రెడ్డి కూడ ఉన్నాడు. ఇతగాడికి కోర్టు తొలుత మరణశిక్ష విధించింది. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో అది 30 ఏళ్ల కఠిన కారాగార శిక్షగా మారింది. ప్రస్తుతం బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఉమేష్ రెడ్డి మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ, టీవీలో ఐటెం సాంగ్ చూస్తూ కనిపించాడు. అతని వద్ద 2 ఆండ్రాయిడ్ ఫోన్లు, మరో కీ ప్యాడ్ మొబైల్ ఫోన్‌లు ఉన్నాయి. ఉమేష్ రెడ్డిని ఉంచిన సెల్‌లో ఒఇఆ టీవీ సదుపాయం కూడా ఉంది. ప్రముఖ నటి రన్యా రావు గోల్డ్ స్మగ్లింగ్ కేసులో అరెస్టైన తరుణ్ రాజు కూడా ఇదే జైలులో సకల భోగాలు అనుభవిస్తున్నాడు. అతడున్న జైలు గదిలో స్వయంగా వంట చేసుకునే సదుపాయం కూడా ఉంది. వీరివద్దనే కాదు ఇతర ఖైదీల వద్ద కూడా మొబైల్ ఫోన్లు ఉండటం విశేషం.కన్నడ నటుడు దర్శన్‌కు జైలు అధికారులు ప్రాథమిక సౌకర్యాలు నిరాకరించగా, ఇక్కడి చాలా మంది కరడుగట్టిన క్రిమినల్స్, రేపిస్టులకు మాత్రం ఎటువంటి పరిమితులు లేకుండా కటకటాల వెనుక విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నట్లు ఈ వీడియో ద్వారా తెలుస్తుంది. వీరితో పాటు ఐసిస్ ఉగ్రవాది జుహాద్ హమీద్ షకీల్‌కు చెందిన మరో వీడియో కూడా ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. అతడు జైలు లోపల గాడ్జెట్‌లు, ఇతర సౌకర్యాలు యదేచ్ఛగా అనుభవిస్తున్నాడు.

## సెహభాష్... తెలంగాణ పోలీస్




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** మనం అనేక సందర్భాల్లో చెప్పుకున్నాం కదా.. పోలీసుల మీద రాజకీయ ఒత్తిడి లేకుంటే.. పోలీసులను వారి పని వారిని చేసుకొనిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయని.. అసాంఘిక శక్తుల ఆటలు సాగవని.. సంఘవిద్రోహశక్తుల దుర్మార్గాలు ముందుకెళ్లవని.. అలాంటి పనిని తెలంగాణ పోలీసులు చేసి చూపించారు. యావత్తు దేశం మొత్తం తమ వైపు చూసుకునేలా చేశారు. నేటి స్మార్ట్ కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దుర్మార్గులు రకరకాల విధాలుగా ప్రజలను మోసం చేస్తున్నారు.. మెసేజ్లు పంపించడం.. లింకులు సెండ్ చేయడం.. డిజిటల్ అరెస్టులు.. మాదక ద్రవ్యాలు దొరికాయని చెప్పడం.. ఇలా రకరకాల విధానాల్లో మోసాలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు సైబర్ నేరగాళ్లు.. ఇలా అమాయకులను మోసం చేస్తే కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు. పైగా ఈ డబ్బులను రకరకాల విధానాలలో మార్చేస్తూ తమ వద్దకు తెచ్చుకుంటున్నారు. ఇలా దొంగిలించిన డబ్బులను మ్యూల్ ఖాతాల సహాయంతో తమ వద్దకు తెచ్చుకుంటున్నారు.. అయితే ఈ తరహా మోసాలు ఇటీవల అధికంగా పెరగడంతో తెలంగాణ సైబర్ పోలీసులు దృష్టి సారించారు. అంతే కాదు సరికొత్త ఆపరేషన్ చేసి యావత్ దేశం మొత్తం తమ వైపు చూసేలా చేశారు.తెలంగాణ పోలీసులకు ఇటీవల కాలంలో సైబర్ ఫిర్యాదులు పెరిగిపోయాయి. తెలంగాణ సైబర్ పోలీసులు ఎన్ని విధాలుగా అవగాహన కల్పించినప్పటికీ నేరాలు తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల తమకు అందిన ఫిర్యాదుల ఆధారంగా తెలంగాణ సైబర్ పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.. 95 కోట్ల స్కాం బయటపడింది.. అంతేకాదు 81 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.. తెలంగాణలో వచ్చిన సైబర్ మోసంపై పోలీసులు దర్యాప్తునుమొదలుపెట్టారు.. మోసానికి పాల్పడిన వ్యక్తులు మొత్తం కూడా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, కర్ణాటకలో ముఠాలుగా ఏర్పడ్డారని పోలీసుల విచారణలో తేలింది. ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో దాడులు నిర్వహించింది. అరెస్టయిన వారిలో 17 మంది ఏజెంట్లు, ఏడుగురు మహిళలు, 58 మంది మ్యూల్ ఖాతాదారులు ఉన్నారు.నిందితుల నుంచి పోలీసులు 84 సెల్‌ఫోన్లతో పాటు 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

# ఇప్పటి వరకు రాని కథ!



కన్నడ భామ రుక్మిణి వసంత్ వరుసగా భారీ చిత్రాలతో బిజీగా ఉంది. ఇటీవల విడుదలైన బ్లాక్‌బస్టర్ హిట్ 'కాంతార: చాప్టర్ 1'లో యువరాణి కనకావతి పాత్రలో ఆమె అభినయానికి మంచి ప్రశంసలు దక్కాయి. ప్రస్తుతం ఈ భామ కన్నడంలో యశ్‌తో కలిసి 'టాక్సిక్', తెలుగులో ఎన్టీఆర్ 'డ్రాగన్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. ఈ సందర్భంగా తాజా ఇన్‌స్టాగ్రామ్ చిట్‌చాట్‌లో అభిమానులతో ఈ సొగసరి 'టాక్సిక్' సినిమా విశేషాలను పంచుకుంది. ఇప్పటివరకు ఇండియన్ స్క్రీన్‌పై రానటువంటి వినూత్న కథాంశమిదని, రా అండ్ రస్టిక్‌గా ఉంటుందని చెప్పింది. 'ఈ కథ ఎన్నో లేయర్స్‌తో కూడుకొని అద్భుతంగా ఉంటుంది. దర్శకురాలు గీతూమోహన్‌దాస్ గొప్ప విజన్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ కథలో హృదయాన్ని కదిలించే ఎమోషన్స్ కూడా ఉంటాయి.' అని రుక్మిణి వసంత్ చెప్పింది. 'కేజీఎఫ్-2' తర్వాత యశ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్'పై ఇప్పటికే అంచనాలేర్పడ్డాయి. వచ్చే ఏడాది మార్చి 16న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

# శరీరాకృతి ఎప్పుడూ ఒకేలా ఉండదు..



మహిళలశరీరాకృతి ఎప్పుడూ ఒకేలాఉండదని,ఐదేళ్లకు ఓసారి మార్పులు జరుగుతుంటాయని ప్రముఖ నటి తమన్నా భాటియా పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ఒకే శరీరాకృతితో కనిపించలేమని ఆమె వివరించారు. బరువు తగ్గేందుకు ఇంజెక్షన్లు వాడుతున్నారంటూ తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పదిహేనేళ్ల వయసు నుంచే తాను నటిస్తున్నానని తెలిపారు. అప్పుడు ఎలా ఉన్నానో ఇప్పటికీ అలాగే ఉన్నానని తాను భావిస్తున్నట్లు చెప్పారు. అయితే, సినిమాల్లోని పాత్రల కోసం ఒక్కోసారి బరువు పెరగడం, మరోసారి తగ్గడం చేయాల్సి వస్తుందని తమన్నా వివరించారు. చిన్న వయసులోనే సినిమాల్లోకి వచ్చానని, కెమెరాతో తన ప్రయాణం సాగుతోందని చెప్పారు. ఇందులో దాచిపెట్టడానికి ఏమీలేదన్నారు. చిరంజీవి సినిమాలో ఐటెం సాంగ్..!: ఇటీవల కాలంలో తమన్నా స్పెషల్ సాంగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారారు. ఆమె నటించిన 'కావాలయ్య', 'డా డా డాస్' వంటి పాటలు షేక్ చేశాయి. ఇప్పుడు అదే జోరుతో చిరంజీవి సినిమాలో కూడా మాస్ ఆడియన్స్‌కు అదిరిపోయే కిక్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. చిరంజీవి లేటెస్ట్ మూవీ 'మన శంకర వరప్రసాద్ గారు'లో స్పెషల్ సాంగ్ ఉండనుందని, అందులో మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా మెగాస్టార్‌తో కలిసి స్టెప్పులేయనున్నారని సమాచారం.

# హృదయాన్ని తాకే ఎమోషన్స్‌తో రమణి కళ్యాణం



దీప్శిక, సూర్య వశిష్ట ప్రధాన పాత్రల్లో విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం రమణి కళ్యాణం. ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా చిత్రబృందం లాంచ్ చేసింది. కిరణ్ అబ్బవరం, వశిష్ట, విజయ్ ఆంటోనీ, జీవీ ప్రకాశ్ కుమార్, సామ్ సిఎస్, రంజిత్ జేయకొడి వంటి ప్రముఖులు ఈ టైటిల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందానికి వారు శుభాకాంక్షలు తెలిపారు. జీవితంలోని సవాళ్ల మధ్య ప్రేమ, విలువలు,
హృదయాన్ని తాకే ఎమోషన్స్ తో అందమైన ప్రయాణంగా ఈ సినిమా ఉండబోతోందని చిత్రబృందం తెలిపింది. వినోదం, భావోద్వేగం, విలువలతో కూడిన కథను నిజాయితీగా చెప్పబోతోన్నామని పేర్కొంది. ఈ చిత్రానికి సూరజ్ ఎస్ కురుప్ మ్యూజిక్ అందిస్తున్నారు. అరవింద్ తిరుకోవెల డీవోపీ, రవితేజ గిరిజాల ఎడిటర్. యువరాజ్ తేజ కాంద్రకోట, రామ్ జగదీశ్, విజయ్ ఆదిరెడ్డి స్క్రీన్ ప్లేని అందిస్తున్నారు. కోర్ట్ సినిమాతో బ్లాక్‌బస్టర్ సక్సెస్ అందుకున్న డైరెక్టర్ రామ్ జగదీశ్ ఈ చిత్రానికి డైలాగ్స్, స్క్రీన్ ప్లే అందించడం విశేషం. రమణి కళ్యాణం తన అందమైన ప్రయాణాన్ని ఈరోజు ప్రారంభించింది. త్వరలోనే ఫస్ట్ లుక్ పోస్టర్లు, టీజర్, ట్రైలర్ లాంటి ఆసక్తికర అప్‌డేట్స్ రానున్నాయి.

# కొరియన్ భాషలో కూడా నటించాలనుందట..!

## హాట్ టాపిక్‌గా రష్మిక మందన్నా కామెంట్స్



బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్నా కాంబోలో వచ్చిన చిత్రం థామా. హార్రర్ సినిమాటిక్ యూనివర్స్‌లో మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ తెరకెక్కించిన ఈ మూవీ అక్టోబర్ 21న విడుదలై బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించింది. మరోవైపు ఇటీవలే తెలుగులో ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా మంచి టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది. బ్యాక్ టు బ్యాక్ సక్సెస్‌లతో ఫుల్ జోష్ మీదున్న రష్మిక ఓ ఆసక్తికర విషయాన్ని అభిమానులు, ఫాలోవర్లతో షేర్ చేసుకుంది. తన ఫిల్మోగ్రఫీలో భిన్నమైన సినిమాలుండేలా ప్లాన్ చేసుకునే రష్మిక కొరియన్ సినిమా చేయడంపై అడిగిన ప్రశ్నకు స్పందించింది. అవును.. కొరియన్ డ్రామా చేయాలనుకుంటున్నా. అవి చాలా ఫన్‌గా ఉంటాయి. కానీ వాళ్లు (మేకర్స్) నాకు ఏం ఇస్తున్నారనే దానిపై కూడా ఇది ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే నేను స్క్రీన్‌పై ఏం చేయగలనో మీకు తెలుసు..
కథ నాకు సెట్ అవుతుందనిపిస్తే కొరియన్ ప్రాజెక్ట్ చేసేందుకు రెడీనంటూ చెప్పుకొచ్చింది. నాకు కొరియన్ సినిమాలపై ప్రేమ కోవిడ్‌టైంలోనే మొదలైంది. కోవిడ్ సమయంలో నా చేతిలో చాలా టైం ఉంది కాబట్టి కొరియన్ డ్రామాల గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. ప్రతీ కొరియన్ డ్రామా 16 ఎపిసోడ్స్‌గా ఉంటుంది. అంటే మీరు ఒక కొరియన్ ప్రాజెక్ట్‌ను స్క్రీన్‌పై చూడాలంటే రోజులో 16 గంటలు కేటాయించవచ్చన్నది రష్మిక మందన్నా. ఈ కామెంట్స్‌తో ఇక రాబోయే కాలంలో కొరియన్ సినిమాలు కూడా చేసినా ఆశ్చర్యపోనవసరం లేదని రష్మిక హింట్ ఇచ్చేస్తుంది.

# హాలీవుడ్‌లో కూడా వివక్ష!



అగ్ర కథానాయిక దీపికా పదుకొణె హాలీవుడ్ ఇండస్ట్రీపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. భారతీయ నటీనటుల పట్ల అక్కడి వారు వివక్ష చూపిస్తుంటారని, అది అందరికీ తెలిసిన విషయమే అని పేర్కొంది. భారతీయ సినిమాలో తిరుగులేని గుర్తింపును దక్కించుకున్న ఈ మంగళూరు సోయగం హాలీవుడ్‌లో కూడా సత్తా చాటుతున్నది. 'ట్రిబుల్ ఎక్స్: రిటర్న్ ఆఫ్ గ్జాండర్ కేజ్' వంటి చిత్రాలతో పాటు పలు అంతర్జాతీయ ఉత్పత్తులకు ఆమె బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ గ్లోబల్ ఐకాన్‌గా పేరు తెచ్చుకుంది. ఓ ఇంటర్నేషనల్ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో దీపికా పదుకొణె హాలీవుడ్ ఇండస్ట్రీ గురించి మాట్లాడింది. 'అందరూ అనుకుంటున్నట్లుగా హాలీవుడ్‌లో ప్రతిదీ నిజాయితీగా, సక్రమంగా ఏమీ ఉండదు. భారతీయ నటీనటులు అక్కడ వివక్షను ఎదుర్కొం టారు. ముఖ్యంగా శరీర రంగు ఆధారంగా వివక్ష చూపిస్తుంటారు. ఉద్దేశ్యపూర్వకంగా అలాంటివి జరుగుతుంటాయి. స్కిన్ కలర్‌తో పాటు మన ఇంగ్లీష్ యాసపై కూడా అక్కడ చిన్నచూపు ఉంటుంది. అందుకే హాలీవుడ్‌లో అవకాశాలు దక్కించుకొని సక్సెస్ కావడం అంత సులభం కాదు. అయితే ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా సరే ఓ భారతీయురాలిగా నా గొంతును బలంగా వినిపించే ప్రయత్నం చేస్తుంటా. నా మూలాలను గౌరవించే వారితోనే పనిచేస్తానని నిక్కచ్చిగా చెబుతాను' అని దీపికా పదుకొణె పేర్కొంది. 'స్పిరిట్' 'కల్కి' వంటి పాన్ ఇండియా తెలుగు చిత్రాల నుంచి దీపికా పదుకొణె తొలగింపు వ్యవహారం జాతీయ స్థాయిలో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దీపికా పదుకొణె ప్రస్తుతం బాలీవుడ్, హాలీవుడ్ చిత్రాలపై దృష్టి పెడుతున్నది.

# చాలా కాలం తర్వాత అసలైన రామ్ చరణ్‌ను చూశా



సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో స్పందిస్తూ తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా ఆయన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌పైనా, యువ దర్శకుడు బుచ్చిబాబుపైనా ప్రశంసల వర్షం కురిపించారు. రామ్ చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'పెద్ది' చిత్రం నుంచి విడుదలైన 'చికిరి చికిరి' పాట సృష్టించిన సంచలనంపై వర్మ స్పందించారు. ఈ పాటలో చరణ్ నటనను, అతన్ని చూపించిన విధానాన్ని మెచ్చుకుంటూ తనఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. "సినిమాలోని ప్రతి కళారూపం, ప్రతి విభాగం అసలు ఉద్దేశ్యం హీరోను మెరుగుపరచడమేచాలా కాలం తర్వాత రామ్ చరణ్‌ను తన అసలైన, సహజమైన, అద్భుతమైన రూపంలో చూశాను. 'చికిరి చికిరి' పాటలో చరణ్ ప్రదర్శించిన నటన, ఆవేశం, ఎనర్జీ నేను ఈ మధ్య కాలంలో చూసిన అత్యుత్తమ ప్రదర్శన" అని రామ్ గోపాల్ వర్మ కొనియాడారు. అంతేకాకుండా, దర్శకుడు బుచ్చిబాబును ఉద్దేశించి వర్మ ప్రత్యేకంగా ప్రశంసించారు. "ఒక స్టార్ తన చుట్టూ అతి తళుకుబెళుకుల మధ్య కాదు, సహజత్వంతో ఉన్నప్పుడే అత్యంత ప్రకాశవంతంగా కనిపిస్తాడు. నువ్వు ఆ విషయాన్ని అద్భుతంగా అర్థం చేసుకున్నావు.
భారీ సెట్స్, వందల మంది డ్యాన్సర్లు లేకుండా, అసలు దృష్టి మొత్తం హీరోపైనే నిలిపావు" అంటూ బుచ్చిబాబు దర్శకత్వ ప్రతిభను మెచ్చుకున్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నా యి. ఇటీవల ఏఆర్ రెహమాన్ సంగీత సారథ్యంలో విడుదలైన 'చికిరి చికిరి' పాట దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. విడుదలైన కొన్ని గంటల్లోనే లక్షల వ్యూస్‌తో ట్రెండింగ్‌లోకి చేరి రామ్ చరణ్ పాన్-ఇండియా క్రేజ్‌ను మరింత పెంచింది. ఈ నేపథ్యంలో రామ్ గోపాల్ వర్మ చేసినఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను రెట్టింపు చేస్తున్నాయి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215